www.prajanaava.in

ప్రజానావ

Telugu Daily


ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 67 | గురువారం | 15 అక్టోబర్, 2026

రష్యా డీజిల్ ఒప్పందంపై ట్రంప్ వెనక్కి!



- ప్రపంచ మార్కెట్ కోసమేనంటూ కొత్త వివరణ
- పుతిన్‌తో డీల్‌పై సొంత పార్టీలోనూ విమర్శలు
- ధరల నియంత్రణ కోసమేనని సమర్థన

2

భారత సంస్కృతికి
ప్రపంచవ్యాప్త గుర్తింపు

సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలతో దేశాలకు చేరువ



- పురాతన తాళపత్రాల పరిరక్షణకు 'జ్ఞాన్ భారతం'
- సరిహద్దులు దాటిన భారతీయ సంస్కృతి
- ప్రధాని నరేంద్ర మోడీ • గ్రేటర్ ఇండియా సొసైటీ శత జయంతి

న్యూఢిల్లీ: భారతీయ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు ప్రపంచవ్యాప్తంగా వివిధ సమాజాలతో దేశాన్ని అనుసంధానిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి ద్వారా భారత సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని పేర్కొన్నారు. చారిత్రక కట్టడాల పరిరక్షణతోపాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అక్టోబర్ 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'కు పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాని సందేశాన్ని చదివి వినిపించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. విదేశాలకు తరలిపోయిన భారత పురాతన కళాఖండాలను తిరిగి తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలకు కొత్త ఊపు లభిస్తోందని మోదీ పేర్కొన్నారు. అదే సమయంలో దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని తెలిపారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన నాగరికతా సంబంధాల ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని ఇందిరా గాంధీ జాతీయ కళా కేంద్రం (ఐజీఎన్‌సీఏ) దీనికి ఏర్పాట్లు చేసింది. ప్రపంచంతో భారత్‌కు ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించి చేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు. వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు సదస్సుకు హాజరవుతున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు 'గ్రేటర్ ఇండియా సొసైటీ' (బృహత్తర భారత్ పరిషత్) శతజయంతి ఉత్సవాలకు కూడా వేదికగా నిలుస్తోంది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో 1926 అక్టోబర్ 14న అప్పటి కలకత్తాలో భారతీయ పండితుల బృందం ఈ సంస్థను స్థాపించినట్లు ఐజీఎన్‌సీఏ వెల్లడించింది. భారతీయ నాగరికత ఇతర దేశాలతో ఏర్పరచుకున్న సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసుకోవడంతో పాటు, వాటి ప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పడం సదస్సు ప్రధాన ఉద్దేశం.



పెట్టుబడులకు తెలంగాణ భరోసా

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం
- యువత ఉద్యోగులుగా కాదు.. యజమానులుగా ఎదగాలి
- సమాఖ్య సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్



2

రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాల్సిందే!

- పంటలు చేతికొచ్చే వరకు కోతలు ఉండొద్దు
- నిర్లక్ష్యం చేస్తే అధికారులపై వేటు తప్పదు
- ఎల్‌నినోపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష.. వచ్చే 20 రోజులు కీలకం



జెండా ఎగరేస్తే జైలుకా?

- సీజేపీ కార్యకర్తల కస్టడీపై విపక్షాల ఆగ్రహం
- జంతర్‌మంతర్‌ను తిరిగి సాధించుకుంటాం: రాహుల్



న్యూఢిల్లీ: జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలను జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరించడం సరికాదని విపక్ష నేతలు మండిపడ్డారు. జంతర్ మంతర్ దేశ ప్రజలకు చెందినదని, దాన్ని తిరిగి సాధించుకుంటామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని జైళ్లకు పంపుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదని రాహుల్‌గాంధీ

తరువాయి 2లో..

సింగరేణిలో
కమీషన్ల దందా!



- వాటాలు కుదరకే నైనీ టెండర్ల రద్దు
- రూ.10వేల కోట్ల స్కామ్.. మరో నాలుగైదు కుంభకోణాలు
- 'సింగరేణి కార్మిక గర్జన'లో కేటీఆర్ ఆరోపణలు

2

రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేయడమే లక్ష్యం

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ • నవంబరు 19 నుంచి ఇందిరమ్మ జీవిత బీమా
- అచ్చంపేటలో రూ.70 కోట్ల అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన

2

దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ

- జాతీయ జెండా ప్రదర్శిస్తే ఐదు రోజుల కస్టడీనా?
- విదేశీ నిధుల ఆరోపణలపై ఆధారాలు చూపాలి
- కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే
- మోదీ సర్కారుపై అభిజీత్ దీప్కే విమర్శలు




నాగ్‌పుర్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో అనధికారిక ఎమర్జెన్సీని అమలు చేస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు సంబంధించి తమ పార్టీకి చెందిన ఇద్దరు నాయకులను ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ జెండాను ప్రదర్శించినందుకే ఇంత కఠినంగా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించాలనుకుంటే అధికారికంగా ప్రకటించాలని, ప్రజలను నిర్బంధిస్తూ పరోక్షంగా ఎమర్జెన్సీని అమలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. బుధవారం మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.'జాతీయ జెండాను ఊపినందుకు ఐదు రోజుల పాటు జైలులో

తరువాయి 2లో..

సీజేపీపై మేరీ మిల్బెన్
సంచలన ఆరోపణలు!

- విద్రోహ శక్తులకు కొందరు అమెరికా దాతల నిధులు
- భారత యువత శాంతియుతంగా నిరసన తెలపాలి
- ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ పరిరక్షణకు ఉద్యమాలకు కౌంటర్ ఉండాలి



2



మళ్లీ చెత్తకుప్పగా!

ఎనిమిది నెలల శ్రమ వృథా.. బిట్టూ ఆవేదన

- అజ్నార్ నది శుభ్రం చేసిన కొద్ది వారాలకే ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన వైనం
- వెనక్కి తగ్గేది లేదంటూ మరోసారి నదిని శుభ్రం చేసేందుకు సిద్ధం

2

బ్లూ డ్రమ్ము హత్య కేసులో
ఇద్దరికీ మరణశిక్ష

2

మేరఠ్ కోర్టు సంచలన తీర్పు

- 22మంది సాక్షుల వాంగ్మూలాల నమోదు

- భర్తను హతమార్చి.. మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్ములో దాచిన భార్య, ప్రియుడు



ఉత్తర్‌ప్రదేశ్‌లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బ్లూ డ్రమ్ము హత్య కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు మరణశిక్ష విధించింది. ఇలాంటి నేరాలు సమాజంలో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తాయని న్యాయమూర్తి అరవింద్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. 22 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం ఈ తీర్పు ఇచ్చింది.

బ్లూ డ్రమ్ము హత్య కేసులో ఇద్దరికీ మరణశిక్ష

మేరఠ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బ్లూ డ్రమ్ము హత్య కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు మరణశిక్ష విధించింది. ఇలాంటి నేరాలు సమాజంలో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తాయని న్యాయమూర్తి అరవింద్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. 22 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం ఈ తీర్పు ఇచ్చింది. ఇద్దరు దోషులు జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచారణకు హాజరయ్యారు. తీర్పుపై సౌరభ్ తల్లి రేణు రాజ్‌పుత్ స్పందించారు. కలిసి జీవించలేని జంటలు విడిపోవాలే తప్ప.. ఇలా హత్య చేసి కుటుంబాలకు తీరని కడుపుకోత మిగల్చకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దారుణాలకు పాల్పడేవారికి మరణశిక్ష విధించాలని న్యాయస్థానాన్ని కోరారు.

ఏమిటీ బ్లూ డ్రమ్ము కేసు?

మేరఠ్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్‌ను గతేడాది ఆయన భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని 15 ముక్కలుగా చేసి ఓ డ్రమ్ములో దాచిపెట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా డ్రమ్మును సిమెంటుతో కప్పేశారు. ఆ తర్వాత ముస్కాన్, సాహిల్ కలిసి హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లారు. హత్య విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

మళ్లీ చెత్తకుప్పగా అజ్నార్ నది!



భోపాల్: నదిని శుభ్రం చేసేందుకు ఎనిమిది నెలల పాటు శ్రమించిన ఓ యువకుడికి నిరాశ ఎదురైంది. ఎంతో కష్టపడి తొలగించిన చెత్త.. కొన్ని వారాలకే మళ్లీ పేరుకుపోవడంతో అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణంలో ప్రవహించే అజ్నార్ నదిని శుభ్రం చేసిన బిట్టూ తబాహి తన అనుభవాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. అయితే, ఈ పరిస్థితికి కుంగిపోనని, మరోసారి నదిని శుభ్రం చేస్తానని స్పష్టం చేశాడు. డిగ్రీ చదువుతున్న సురేంద్ర సింగ్ చౌధరీ అలియాస్ బిట్టూ తబాహి.. స్థానిక అజ్నార్ నది ప్లాస్టిక్ వ్యర్థాలతో చెత్తకుప్పగా మారడాన్ని చూసి చలించిపోయాడు. ఎలాగైనా నదిని శుభ్రం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈత రాకపోయినా, ప్రత్యేక పరికరాలు, గ్లౌజులు, బూట్లు అందుబాటులో లేకపోయినా వెనుకడుగు వేయలేదు. స్నేహితుల సహకారంతో ఎనిమిది నెలల పాటు శ్రమించి, టన్నుల కొద్దీ వ్యర్థాలను తొలగించాడు. ఈ ప్రయత్నంతో అతడు వార్తల్లో నిలిచాడు.అయితే, నదిని శుభ్రం చేసిన కొద్ది వారాలకే స్థానికులు మళ్లీ ప్లాస్టిక్ సంచులు, ఇతర చెత్తను అందులో పడేయడంతో పరిస్థితి మొదటికొచ్చింది. దీంతో బిట్టూ తీవ్ర నిరాశకు గురయ్యాడు.

వెనక్కి తగ్గేది లేదు

''నా ఎనిమిది నెలల కఠోర శ్రమ ఇలా వృథా అవుతుందని అనుకోలేదు. ఈత రాకపోయినా, ప్రత్యేక పరికరాలు లేకపోయినా ఎంతో కష్టపడి నదిని శుభ్రం చేశాను. అయినా ప్రజలు మళ్లీ చెత్తతో కలుషితం చేశారు. కానీ నేను వెనక్కి తగ్గను. మరోసారి నదిని శుభ్రం చేస్తాను. ఈ పనిని త్వరగా పూర్తి చేయాలంటే ఏం చేయాలో సలహాలు ఇవ్వండి'' అని బిట్టూ ఇన్‌స్టాగ్రామ్‌లో కోరాడు. నదిలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యాలను సైతం పంచుకున్నాడు.బిట్టూ పట్టుదల, నిబద్ధతను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. నదులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని, నదులను కలుషితం చేసేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.భారత పరిపాలనకు రాజ్యాంగమే పునాది అని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దేశం ముందుకు సాగాలని దీప్కే అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని దేశంపై రుద్దేందుకు చేసే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. భారత్ ఎప్పటికీ అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తుందని పేర్కొన్నారు. బుధవారం నాగ్‌పుర్‌లోని దీక్షాభూమిని సందర్శించి అంబేద్కర్‌కు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. 1956 అక్టోబర్ 14న అంబేద్కర్ వేలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించిన చారిత్రక ప్రదేశం దీక్షాభూమి కావడంతో, ఈ సందర్భంగా రాజ్యాంగ విలువల ప్రాధాన్యాన్ని ఆయన ప్రస్తావించారు.

రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీ పడేలా చేయడమే లక్ష్యం



ప్రజానావ, నాగర్‌కర్నూల్–అమ్రాబాద్: 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడేలా కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కుటుంబానికి ఆదాయాన్ని అందించే పెద్ద వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నవంబరు 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి రూ.70 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు భట్టి శంకుస్థాపనలు చేశారు. మన్ననూరులో 220/30 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

గత పదేళ్లలో నిధుల దోపిడీ

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలంగాణను అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలు ఆశించారని, అయితే గత పదేళ్లలో నిధుల దోపిడీ జరిగిందని భట్టి విమర్శించారు. ధరణి పేరుతో భూములను కొల్లగొడుతూ ప్రజల స్వేచ్ఛను హరించే ప్రయత్నాలు జరిగినప్పుడు తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాదయాత్రలు, భారీ బహిరంగ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామని పేర్కొన్నారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా లింగాల, బల్మూరు, అచ్చంపేట మండలాల్లోని 42 గ్రామాల్లో 130 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసినట్లు గుర్తుచేశారు.

20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగినా, ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీలు కృష్ణభాస్కర్, జితేష్ పాటిల్, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్, సబ్ కలెక్టర్ సలోని తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు తెలంగాణ భరోసా

ప్రజానావ, హైదరాబాద్: పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల విధానాలను అమలు చేస్తున్నామని, కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదని, మంచి విధానాలతో ఎవరొచ్చినా స్వాగతిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో బుధవారం జరిగిన సమాఖ్య సదస్సులో ఆయన మాట్లాడారు.

దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతమే అయినా.. జీడీపీలో రాష్ట్రం 5 శాతం వాటా అందిస్తోందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

మూడు ఆర్థిక మండళ్లుగా అభివృద్ధి

తెలంగాణను అర్బన్, పెరి అర్బన్, రూరల్ ప్రాంతాలుగా మూడు ఆర్థిక మండళ్లలో అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సేవలు, తయారీ, వ్యవసాయ రంగాలకు సమప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహకాలు అందించేలా సమగ్ర విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. దేశ, విదేశీ పెట్టుబడుల ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.'

'సత్య నాదెళ్ల వంటి వారు అంతర్జాతీయ సంస్థలకు సీఈవోలుగా సేవలందిస్తున్నారు. కానీ వారు ఆ సంస్థలకు యజమానులు కాదు. బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగులుగా ఎదగడమే కాకుండా.. మన యువత సొంత సంస్థలను స్థాపించి యజమానులుగా ఎదగాలి. స్కైరూట్ తరహాలో తెలంగాణ నుంచి మరిన్ని స్టార్టప్‌లు రావాలి'' అని సీఎం ఆకాంక్షించారు. యువత వ్యక్తులుగా కాకుండా ఒక



సమూహంగా ఏకమైతే మరింత బలంగా ఎదగవచ్చని సూచించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతోపాటు.. మహిళా సంఘాలు వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చే స్థాయికి ఎదిగాయని వివరించారు. మహిళా సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేసి జెన్‌కోకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.ప్రతి జిల్లాలోనూ మహిళా సంఘాలకు భూములు కేటాయించి, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. శిల్పారామం వద్ద 3.5 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి బజార్లు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్‌కు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువతతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలను కూడా సమాఖ్య ప్రోత్సహించాలని కోరారు.

పరిశ్రమలకు పూర్తి సహకారం

పారిశ్రామిక అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదని సీఎం స్పష్టం చేశారు. గత 30 ఏళ్లుగా అమల్లో ఉన్న మంచి పారిశ్రామిక విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. పెట్టుబడులకు భద్రత, లాభదాయకమైన అవకాశాలు, సత్వర అనుమతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణకు వచ్చి ప్రభుత్వంతో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

రష్యా డీజిల్ ఒప్పందంపై ట్రంప్ వెనక్కి!

వాషింగ్టన్: రష్యా నుంచి డీజిల్ కొనుగోళ్లకు సంబంధించి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కుదిరిన ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సొంత పార్టీ నుంచీ విమర్శలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన తన వైఖరిని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. రష్యాతో కుదిరిన డీజిల్ ఒప్పందం అమెరికా కోసం కాదని, ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించేందుకేనని వివరణ ఇచ్చారు.''అది డీజిల్ ఒప్పందం. మన కోసం కాదు.. ప్రపంచం కోసం'' అని ట్రంప్ మీడియాతో పేర్కొన్నారు. అధిక ధరలతో ఒత్తిడికి గురవుతున్న అంతర్జాతీయ మార్కెట్‌ను స్థిరీకరించేందుకు రష్యా రిఫైనరీల నుంచి వచ్చే ఇంధనాన్ని వినియోగించనున్నట్లు తెలిపారు.

నవంబరులో జరగనున్న మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో అమెరికాలో ఇంధన ధరల పెరుగుదల చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో రష్యా డీజిల్‌పై ఆంక్షలను 2027 ఏప్రిల్ వరకు ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం వెల్లడించారు.

దశలవారీగా సరఫరా

తొలుత మూడు లక్షల టన్నులకు పైగా డీజిల్‌ను అమెరికాకు, అంతర్జాతీయ మార్కెట్‌కు రష్యా తక్షణమే సరఫరా చేసేలా ఒప్పందం కుదిరిందని ట్రంప్ గతంలో వెల్లడించారు. నవంబరులో మరో ఐదు లక్షల టన్నులు, ఆ తర్వాత వెంటనే ఇంకో పది లక్షల టన్నులు సరఫరా చేస్తుందని తెలిపారు. అనంతరం రష్యా డీజిల్ రిఫైనరీల పరిస్థితులను బట్టి స్వల్ప వ్యవధిలో మరో 30 లక్షల టన్నుల వరకు ఇంధనం అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ

(మొదటి పేజీతరువాయి)



ఉంచడం సరికాదు. 1975లో ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ సమయంలోనూ ఇలాంటి పరిస్థితి లేదు. ప్రజల గొంతు నొక్కే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ప్రభుత్వానికి ఎమర్జెన్సీ విధించాలనే ఉద్దేశం ఉంటే అధికారికంగా ప్రకటించాలి. ప్రజలను నిర్బంధిస్తూ అనధికారికంగా అత్యవసర పరిస్థితులను అమలు చేయడం పిరికిపంద చర్య. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం సహజం. ప్రజల హక్కులను పరిమితం చేయడం తగదు'' అని దీప్కే పేర్కొన్నారు.

విదేశీ నిధులపై దర్యాప్తు చేయించండి

సీజేపీకి విదేశాల నుంచి నిధులు అందుతున్నాయన్న ఆరోపణలపైనా దీప్కే స్పందించారు. ఈ విషయంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దర్యాప్తు చేయించి, ఆరోపణలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యమం 'అర్బన్ నక్సలిజం' ప్రభావంలో ఉందన్న ఆరోపణలను తోసిపుచ్చారు. అనుమానాలుంటే విచారణ జరిపించాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. కేంద్రం దృష్టి సారించాల్సిన ఇతర అంశాలను పక్కనపెట్టి తమ నిరసనపై దృష్టి పెట్టిందని విమర్శించారు.

ఇండియా కూటమితో లక్ష్యం ఒక్కటే

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను కోరుతూ ఇండియా కూటమి చేపడుతున్న నిరసనలపైనా దీప్కే మాట్లాడారు. సీజేపీ స్వతంత్ర ఉద్యమ సంస్థగా పనిచేస్తోందని, భవిష్యత్తులోనూ అదే వైఖరిని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అయితే, స్వతంత్రంగా పనిచేస్తున్నంత మాత్రాన ఇండియా కూటమికి వ్యతిరేకమని భావించరాదన్నారు. రెండు సంస్థలు వేర్వేరైనప్పటికీ ప్రస్తుత ఉద్యమాల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని, మోదీ అధికారంలో కొనసాగేందుకు జ్ఞానేశ్‌కుమార్ సహకరిస్తున్నారని తాము ఆరోపిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగ స్ఫూర్తే దేశానికి పునాది

భారత పరిపాలనకు రాజ్యాంగమే పునాది అని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దేశం ముందుకు సాగాలని దీప్కే అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని దేశంపై రుద్దేందుకు చేసే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. భారత్ ఎప్పటికీ అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తుందని పేర్కొన్నారు. బుధవారం నాగ్‌పుర్‌లోని దీక్షాభూమిని సందర్శించి అంబేద్కర్‌కు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. 1956 అక్టోబర్ 14న అంబేద్కర్ వేలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధమతాన్ని స్వీకరించిన చారిత్రక ప్రదేశం దీక్షాభూమి కావడంతో, ఈ సందర్భంగా రాజ్యాంగ విలువల ప్రాధాన్యాన్ని ఆయన ప్రస్తావించారు.

సీజేపీపై మిల్బెన్ సంచలన ఆరోపణలు!

న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి అమెరికాలోని కొందరు దాతలు నిధులు అందిస్తున్నారని అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ ఆరోపించారు. దేశంలో గందరగోళం సృష్టించేందుకు విద్రోహ శక్తులు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిణామాలపై మౌనంగా ఉండే సమయం కాదని, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను పరిరక్షించేందుకు భారత యువత శాంతియుతంగా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు చేశారు.ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని ఢిల్లీలో విపక్షాలు, సీజేపీ ప్రతినిధులు నిరసనలు చేస్తున్న నేపథ్యంలో మిల్బెన్ స్పందించారు. ''25 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న మీ ప్రధాని మోదీ.. అమెరికా నుంచి వచ్చే విద్రోహ శక్తులకు తలవంచరు. కొందరు దాతలు ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ నేతలను లక్ష్యంగా చేసుకుంటారు. అమెరికాలో చదువుకున్న ఆయా దేశాలకు చెందిన వ్యక్తులను గుర్తించి, వారికి తీవ్రవాద భావజాలాన్ని నూరిపోసి స్వదేశాలకు పంపిస్తారు. అక్కడ గందరగోళం, విధ్వంసం సృష్టించేందుకు నిధులు అందిస్తుంటారు'' అని ఆమె పేర్కొన్నారు.ఇలాంటి ప్రయత్నాలు విజయవంతం కాకపోయినా.. దేశ అభివృద్ధి, పాలనపై ప్రతికూల ప్రభావం చూపుతాయని మిల్బెన్ అభిప్రాయపడ్డారు. భారత యువత మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను కాపాడేందుకు ఇలాంటి ఉద్యమాలకు శాంతియుతంగా ప్రతిస్పందించాలని సూచించారు.



భారత్‌లో ప్రత్యేక గుర్తింపు

ఆఫ్రికన్–అమెరికన్ గాయని అయిన మేరీ మిల్బెన్‌కు భారత్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. భారత జాతీయగీతం, 'ఓం జై జగదీశ హరే' గీతాల ఆలాపనతో ఆమె దేశ ప్రజల ఆదరణ పొందారు.

జెండా ఎగరేస్తే జైలుకా?

(మొదటిపేజీ తరువాయి)

ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలా చేసినందుకు యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై పోరాడుతున్నా.. అందరి లక్ష్యం ఒక్కటేనని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పౌరులు చేస్తున్న ఆందోళనలన్నీ ఒకే పోరాటంలో భాగమని పేర్కొన్నారు. ''జంతర్‌మంతర్ భారత ప్రజలకు చెందినది. దాన్ని తిరిగి సాధించుకుంటాం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాపాడుకోవాలి'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ముందు ఓటు.. ఇప్పుడు నిరసన హక్కు చోరీ: ఖర్గే

ప్రజల ఓటు హక్కును హరించే ప్రయత్నాల తర్వాత ఇప్పుడు నిరసన తెలిపే హక్కునూ కాలరాస్తున్నారని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు వెలుపల ఉన్న 13.3 కోట్ల మందిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 'చొరబాటుదారులు'గా అభివర్ణించడం వారి జాతీయతను అవమానించడమేనని విమర్శించారు. సుప్రీంకోర్టు నిర్ణయం ఉన్నప్పటికీ జంతర్‌మంతర్‌ను నిరసనలకు అనుమతించే ప్రదేశాల జాబితా నుంచి తొలగించడాన్ని తప్పుబట్టారు.''మొదట ఓటు చోరీ.. ఇప్పుడు నిరసన హక్కు చోరీ. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు రక్షణ కల్పించడం ఆపాలి. యువ నిరసనకారులను జైలుకు పంపడం, ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేయడం, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడం ఆందోళనకరం'' అని ఖర్గే పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్నాయని తాను పేర్కొన్న కొన్ని వర్గాలకు అధికారులు స్వేచ్ఛనిస్తున్నారని ఆరోపించారు. మోదీ–షా ప్రభుత్వ విధానాలకు ప్రజలు తలవంచబోరని, బీజేపీని ప్రతి అంశంపైనా నిలదీస్తారని తెలిపారు.

మన జెండా ఎగరేయడం నేరమా?: కేజ్రీవాల్

సీజేపీ కార్యకర్తలపై చర్యలను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా తప్పుబట్టారు. సొంత దేశంలో జాతీయ జెండాను ప్రదర్శించడం నేరమా? అని ప్రశ్నించారు. నిరసన తెలిపిన యువతను జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల చర్య హాస్యాస్పదంగా ఉందని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

అరెస్టయిన యువతకు డీఎంకే అండ

సీజేపీ కార్యకర్తల నిర్బంధంపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ స్పందించారు. ప్రభుత్వం ఎంతమంది నిరసనకారులను నిర్బంధించగలదని, ఎంతమంది యువత గొంతులను అణచివేయగలదని ప్రశ్నించారు. యువతను జైలుకు పంపే కొద్దీ రాజకీయాలతో సంబంధం లేని సాధారణ పౌరులు సైతం వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతారని అన్నారు. అరెస్టయిన సౌరవ్ దాస్, ఆశుతోష్‌కు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని ప్రకటించారు. నిరసనకారులపై చర్యలు ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచుతాయని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యంపై దాడి: ఆదిత్య ఠాక్రే

శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే సైతం సీజేపీ కార్యకర్తల అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. జంతర్‌మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించిన యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి సాధించుకునే వరకు ప్రభుత్వానికి, దేశభక్తులైన యువతకు మధ్య పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

సింగరేణిలో కమీషన్ల దందా

ప్రజానావ, గోదావరిఖని: సింగరేణి సంస్థను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. వాటాలు కుదరకపోవడంతో నే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లను రద్దు చేశారని ఆరోపించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన 'సింగరేణి కార్మిక గర్జన' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

వాటాలు కుదరకే కుంభకోణాల బట్టబయలు

సింగరేణిలో నైనీ కుంభకోణాన్ని అడ్డుకున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని ప్రకటించారని పేర్కొన్నారు. వాటాలు కుదరకపోవడంతోనే కుంభకోణాల గురించి వారే బయటపెట్టుకుంటున్నారని ఆరోపించారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధన పేరుతో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని, సోలార్, జిలెటిన్ స్టిక్స్ వ్యవహారాల తోపాటు మరో నాలుగైదు కుంభకోణాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం

ఈ వ్యవహారాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ తెలిపారు. సింగరేణి కార్మికుల జీవితాలను దెబ్బతీస్తున్నారని, ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరినట్లు చెప్పారు. సింగరేణిలో చోరీ జరిగిందని, దానిని ముఖ్యమంత్రే పట్టుకోవాలని కిషన్‌రెడ్డి లేఖ రాశారని పేర్కొన్నారు. ఒకరికొకరు అండగా నిలుస్తూ, కమీషన్లు పంచుకునేందుకు సింగరేణిని కొల్లగొడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాల్సిందే!

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు ఎలాంటి విద్యుత్ కోతలు ఉండకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ సరఫరాను పెంచాలని సూచించారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, విద్యుత్ కొరతతో రైతులు నష్టపోకుండా చూడాలని ఆదేశించారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా పరిస్థితులను అధికారులు వివరించారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సరఫరా సజావుగా ఉండేలా పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ కొరత ముప్పు ఉన్నప్పుడు ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు త



వైభవంగా జై భవాని అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ప్రజానావ, ఫిలింనగర్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఫిలింనగర్‌లోని ఇంద్రనగర్‌లో జై భవాని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి సభ్యుడు దాసోజు శ్రవణ్, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారో గ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, ఇంద్రనగర్ స్థానికులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లోక్‌భవన్‌లో నేడు బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవం ప్రతిబింబించేలా వేడుకలు

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు లోక్‌భవన్‌లో నేడు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పూలను పూజించే పండుగగా, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల సౌరభాన్ని చాటిచెప్పేలా లోక్‌భవన్ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో లోక్‌భవన్ పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా పాల్గొని బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములు కానున్నారు. కోలాట బృందాల ప్రదర్శనలు, బతుకమ్మ పాటల మధురిమతో లోక్‌భవన్ ప్రాంగణం సందడిగా మారనుంది. లోక్‌భవన్ పరివారం సైతం ఈ వేడుకల్లో పాల్గొననుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించేలా ఈ సంబరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

టీఆర్ఎస్ నాయకులకు కల్వకుంట్ల కవిత దిశానిర్దేశం



ప్రజానావ, శేరిలింగంపల్లి: గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం కావాలని తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత పార్టీ నాయకులకు సూచించారు. చందానగర్‌లో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె పాల్గొని దిశానిర్దేశం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు పార్టీ ప్రధాన సిద్ధాంతమైన పాంచజన్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి చేరువ కావాలని సూచించారు.

మన బతుకమ్మ వైభవాన్ని ముందు తరాలకు అందించాలి

- తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత
- సంప్రదాయ బతుకమ్మ పాటలను యువత నేర్చుకోవాలి
- మదీనాగూడలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కవిత



ప్రజానావ, మదీనాగూడ: బతుకమ్మ వంటి విశిష్టమైన పండుగ తెలంగాణకు సొంతమని, ఇంతటి గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ వైభవాన్ని ముందు తరాలకు అందించాలని తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. మదీనాగూడలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల్లో దేవుళ్లను పూలతో పూజిస్తే, తెలంగాణలో పూలనే దేవుళ్లుగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం ఉందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి విశిష్టమైన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువత సంప్రదాయ బతుకమ్మ పాటలను నేర్చుకోవాలని సూచించారు. ఒక్కసారి బతుకమ్మ పాటను నేర్చుకుంటే ఆ పాట ద్వారా పండుగ సంప్రదాయం వందేళ్లపాటు జీవిస్తుందని కవిత పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగ వైభవాన్ని తరతరాలకు కొనసాగించాలని ఆమె పిలుపునిచ్చారు.

నర్సంపేటలో మున్సిపల్ స్థలాలు కబ్జా!

- **ఫుట్‌పాత్‌లపై డబ్బాలు, గుడిసెల ఏర్పాటు**
- **చిరు వ్యాపారుల నుంచి వేలల్లో అద్దెల వసూలు**
- **ఆక్రమణదారుల జేబుల్లోకి మున్సిపల్ ఆదాయం**
- **ఏటా లక్షల రూపాయల నష్టం**



ప్రజానావ, నర్సంపేట : నర్సంపేట పట్టణంలో పురపాలికకు చెందిన ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రధాన రహదారుల వెంట ఉన్న కాలిబాటలను ఆక్రమించి డబ్బాలు, చిన్న గుడిసెలు ఏర్పాటు చేస్తూ కొందరు యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఈ ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పురపాలికకు రావాల్సిన ఆదాయం దళారుల జేబుల్లోకి వెళ్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా నర్సంపేట పట్టణంలోని ప్రధాన మార్గాల్లో పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెక్కొండ మార్గంలో ఆటోల అడ్డా నుంచి క్యాంపు కార్యాలయం చివరి వరకు, క్యాంపు కార్యాలయం వెనుక వీధిలో, బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ కార్యాలయం పరిసరాల్లో, కోర్టు ప్రహరీ వెంబడి మురుగు కాలువలు, రోడ్డు పక్కన ఉన్న స్థలాల్లో డబ్బాలు, గుడిసెలు ఏర్పాటు చేసి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి రోడ్డు పక్కన స్థలాలు, మురుగు కాలువలకు ఆనుకుని ఉన్న ప్రాంతాలు పురపాలిక పరిధిలోకి వస్తాయి. ఆయా స్థలాలను నిబంధనల ప్రకారం వినియోగిస్తే మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కానీ కొందరు స్థలాలను ఆక్రమించి డబ్బాలు, గుడిసెలు ఏర్పాటు చేయడమే కాకుండా, వాటిని చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఫలితంగా మున్సిపాలిటీకి ఏటా లక్షల రూపాయల ఆదాయం గండిపడుతోంది. ఆక్రమణలను తొలగించి, ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుని చిరు వ్యాపారులకు తక్కువ అద్దెకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ఏటా రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు అద్దె

నెక్కొండ మార్గంలో సుమారు 8×9 అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఒక్కో డబ్బాకు ఏడాదికి రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో సుమారు 30 డబ్బాలు ఉన్నట్లు సమాచారం. క్యాంపు కార్యాలయ ప్రహరీని ఆనుకుని సులభ్ కాంప్లెక్స్ నిర్మించగా, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఓ వ్యక్తి ఆ కాంప్లెక్స్ కనిపించకుండా ఇరువైపులా రెండు డబ్బాలు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలున్నాయి. వాటిలో ఒకదాన్ని అద్దెకు ఇవ్వగా, మరో దానిలో తానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కోర్టు, వ్యవసాయ కార్యాలయాల ప్రహరీలను ఆనుకుని ఏర్పాటు చేసిన గుడిసెలు, డబ్బాలకు కూడా వేలాది రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. పురపాలికకు చెందిన స్థలాల్లో వ్యాపారాలు సాగుతున్నప్పటికీ, వాటి ద్వారా వచ్చే ఆదాయం మున్సిపాలిటీకి చేరకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆక్రమించి.. విక్రయించి సొమ్ము చేసుకుంటూ

పురపాలిక స్థలాలను ఆక్రమించడమే కాకుండా, వాటిపై హక్కు ఉన్నట్లుగా భావించి చిరు వ్యాపారులకు విక్రయిస్తూ కొందరు లక్షల రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలున్నాయి. నెక్కొండ మార్గంలో సుమారు ఆరేళ్ల క్రితం ఓ వ్యక్తి అద్దెకు ఇచ్చిన స్థలాన్ని మరొకరికి రూ.60 వేలకు విక్రయించినట్లు సమాచారం. అలాగే నాలుగేళ్ల క్రితం చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తాను డబ్బా ఏర్పాటు చేసుకున్న స్థలాన్ని రూ.1.10 లక్షలకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. కోర్టు ప్రహరీని ఆనుకుని ఉన్న గుడిసె స్థలాన్ని మరో వ్యక్తి రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసి ప్రస్తుతం అక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. పురపాలికకు చెందిన స్థలాలను వ్యక్తులు విక్రయించడం, వాటిపై అద్దెలు వసూలు చేయడం వంటి వ్యవహారాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఆక్రమణలను గుర్తించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతోపాటు, మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బాధితురాలికి కాటూరి రమేశ్ ఆర్థిక సాయం

ప్రజానావ, ఫిలింనగర్: ఫిలింనగర్ డివిజన్ పరిధిలోని గురుబ్రహ్మ నగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సత్యమాల అనే మహిళకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న స్థానికులు డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్‌కు విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అధికారులను అక్కడికి పిలిపించి, బాధితురాలికి ప్రభుత్వం తరపున త్వరితగతిన ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇబ్బందుల్లో పడిన బాధితురాలిని ఆదుకునేందుకు కాటూరి రమేశ్ తన వంతుగా తక్షణ ఆర్థిక సాయం అందించారు. బాధితురాలికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

ఎనుమాముల మార్కెట్‌లో యార్డుల కేటాయింపుపై ఆరోపణలు

- **ఆదాయం వచ్చే విభాగాలపై కొందరి పట్టు**
- **ఏళ్లుగా ఒకేచోట విధులు**



ప్రజానావ, వరంగల్ : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అధికారుల విధుల కేటాయింపు, యార్డుల నిర్వహణ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మార్కెట్‌లో పనిచేసే సూపర్‌వైజర్లు, కార్యదర్శి, సహాయ కార్యదర్శులు, గ్రేడ్–2 కార్యదర్శులకు యార్డులు, నిర్వహణ బాధ్యతలు కేటాయించే విషయంలో మార్కెట్ పాలకవర్గానికి అధికారాలు ఉంటాయి. ఈ క్రమంలో మార్కెట్ కార్యదర్శి, పాలకవర్గం అందదండలు ఎవరికి ఉంటే.. ఆదాయం వచ్చే యార్డులు వారికే దక్కుతున్నాయనే ప్రచారం సాగుతోంది. మరోవైపు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేసేందుకు సంబంధిత అధికారులు సాహసించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదాయం వచ్చే యార్డులపై మక్కువ

మార్కెట్ అధికారులు, సిబ్బందికి ఏ యార్డు కేటాయించినా అక్కడ విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత ఉంటుంది. అయితే తమకు అనుకూలంగా లేని చోట విధులు కేటాయిస్తే కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పసుపు, పల్లికాయ యార్డులో విధులు నిర్వర్తించిన ఓ సూపర్‌వైజర్‌కు గత మామిడి సీజన్‌లో పండ్ల మార్కెట్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన పండ్ల మార్కెట్ నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో జీరో దందా జోరుగా సాగిందనే ఆరోపణలు వినిపించాయి. ప్రస్తుతం పైరవీలు చేసి మరీ ఆదాయం వచ్చే లెక్కించే మార్కెట్ పరిపాలన భవనంలోని అసెస్‌మెంట్, పర్చేస్ రిటర్న్స్ విభాగంలోనూ కొందరు ఉద్యోగులు ఏళ్లుగా పాతుకుపోయారనే ఆరోపణలున్నాయి. ఈ విభాగంలో ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులే కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వారిలో ఒకరు ఏ నుంచి ఎం వరకు, మరొకరు ఎన్ నుంచి జెడ్ వరకు వ్యాపారుల పేర్ల అక్షరక్రమం ఆధారంగా నెలవారీ కొనుగోళ్లు, వాటిపై చెల్లించాల్సిన మార్కెట్ ఫీజులను లెక్కిస్తుంటారు. ఆయా వ్యవహారాల్లోని లోటుపాట్లు, ఆదాయ వ్యయాల లెక్కలపై పూర్తి అవగాహన ఉండటంతోనే వారిని అక్కడి నుంచి మార్చడం లేదనే ప్రచారం సాగుతోంది. మార్కెట్ ఆదాయానికి కీలకమైన విభాగాల్లో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ, దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది విషయంలో ఉన్నతాధికారులు సమీక్ష చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సింగరేణి కార్మిక గర్జనకు తాండూర్ బీఆర్ఎస్ శ్రేణుల తరలింపు

- **మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నేతృత్వంలో భారీగా బయలుదేరిన నాయకులు, కార్మికులు**

ప్రజానావ, తాండూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభకు తాండూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, కార్మికులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ మంగపతి సురేష్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు బయలుదేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ ఈ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ అండగా నిలుస్తారని నాయకులు తెలిపారు.



రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

- **కోనాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు, రైతుల ధర్నా**
- **వందల ఎకరాల్లో ఎండుతున్న వరి పంటలు**

ప్రజానావ, బాన్సువాడ రూరల్: రైతులకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడ మండలంలోని కోనాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం బీఆర్ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం కనీసం ఐదు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ అందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా వందలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు మోరిల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ ధర్నాలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వసంత్‌రావు, శంకర్ గౌడ్, భూషణంతో పాటు కోనాపూర్, సంగోజీపేట్, హన్మాజీపేట్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో బీఆర్ఎస్ మహిళా నేతల ప్రత్యేక పూజలు

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో పలువురు నేతల దర్శనం

ప్రజానావ, కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ మహిళా నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్లు తుల ఉమ, అంగోత్ బిందు, శ్రీదేవి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో సత్యనారాయణ వారికి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు చేసిన నేతలు వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారు, దుర్గాదేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో వేదపండితులు వారికి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత కురవి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురవి సర్పంచ్ లక్ష్మీ నాయక్, మాజీ ఆలయ చైర్మన్ రాజునాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, కొణతం విజయ్, పెద్ది వెంకన్న గౌడ్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీనునాయక్, గుగులోత్ నెహ్రూనాయక్, సంగెం భరత్, భద్రు, భోజ్య నాయక్, బాణోత్ శారద, అంగోత్ కాంతి, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.లక్ష బీమా చెక్కు

- **గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలను అభినందించిన డీఆర్‌డీవో శ్రీను**

ప్రజానావ, హనుమకొండ: ఆపద సమయాల్లో బీమా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని డీఆర్‌డీవో శ్రీను అన్నారు. హనుమకొండలోని గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడు కుంటమల్ల గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన ప్రమాద బీమా చేయించుకోవడంతో పరిహారంగా మంజూరైన రూ.లక్ష చెక్కును నామినీ అయిన కుంటమల్ల స్వప్నకు డీఆర్‌డీవో శ్రీను బ్యాంకు ప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా బీమా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఖాతాదారులకు సేవలందించడంతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ మ్యాదరి సందీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి జీఎం కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

ప్రజానావ, కొత్తగూడెం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగు ల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించిన మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం సీహెచ్. వెంకటరమణ మాట్లాడు తూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదా యాలను భావిత రాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలతో ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యాలయ ప్రాంగణం పూల అందాలతో పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు గీతారాణి, ఎస్‌వో టు జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, డీవైపీఎం హరీష్, మహిళా ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హరీశ్‌రావుకు బీఆర్ఎస్ శ్రేణుల ఘనస్వాగతం

- రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ
- ఎండిన పంట పొలాల పరిశీలన
- రైతుల సమస్యలపై ఆరా

ప్రజానావ, గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్‌రావుకు బుధవారం గద్వాల నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పట్టణంలోని జమ్మిచేడు వద్ద బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ తదితరులు పార్టీ శ్రేణులతో కలిసి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్‌రావును శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. అలాగే వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై క్షేత్రస్థాయిలో ఆరా తీయనున్నారు.

గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలి

- ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్‌రెడ్డి డిమాండ్

ప్రజానావ, చౌటుప్పల్ : గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని, ఉప సర్పంచుల జాయింట్ చెక్ పవర్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఉప సర్పంచుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాలు ఏర్పడి పది నెలలు గడుస్తున్నా, అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను విద్యుత్ బిల్లుల చెల్లింపులకు మళ్లించాలని ఒత్తిడి చేయడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. నిధుల విడుదల కోసం సర్పంచులు, ఉప సర్పంచులు ఐక్యంగా పోరాడకుండా వారి మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 2018లో అప్పటి ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం ద్వారా సర్పంచులు, ఉప సర్పంచులకు జాయింట్ చెక్ పవర్ కల్పించిందని, దీనివల్ల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత ఉంటుందని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే చెక్కులపై ఉప సర్పంచులు ఏడు రోజుల్లో సంతకం చేయాలనే ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఎవరైనా ఉప సర్పంచులు సరైన కారణం లేకుండా సంతకం చేయకపోతే సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకానీ అందరికీ ఒకే విధమైన ఆంక్షలు విధించడం తగదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఉప సర్పంచుల జాయింట్ చెక్ పవర్‌పై ఆంక్షలు ఎత్తివేసి, దానిని యథాతథంగా కొనసాగించాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయడంతోపాటు ఉప సర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కోట మైసమ్మ జాతరకు ముహూర్తం ఖరారు

- 20 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు.. ఏర్పాట్లపై దృష్టి

ప్రజానావ, కారేపల్లి : భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ తల్లి జాతరకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజులపాటు జాతర నిర్వహించనున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాలకు తెలంగాణలోని వివిధ ప్రాంతాలతోపాటు పొరుగు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఏటా దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహించే ఈ జాతరకు ఇల్లెందు, కారేపల్లి పరిసర ప్రాంతాలతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉంది.

20వ తేదీ నుంచి జాతర ప్రారంభం

ఈ నెల 20న ప్రారంభమయ్యే జాతర మూడు రోజులపాటు కొనసాగనుంది. జాతర నిర్వహణ బాధ్యతలను దేవాదాయ ధర్మాదాయ శాఖ చేపట్టనుంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అమ్మవారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. భక్తుల రద్దీని నియంత్రించడం, తాగునీటి వసతి కల్పించడం, పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

కోట మైసమ్మ తల్లి జాతరకు ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. ఈసారి కూడా తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోనున్నారు. జాతర సందర్భంగా ఉసిరికాయలపల్లి పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొననుంది. భక్తుల రాకతో స్థానికంగా వ్యాపార కార్యకలాపాలు సైతం ఊపందుకునే అవకాశం ఉంది.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

మూడు రోజులపాటు జరిగే జాతరకు భారీగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. భక్తుల రాకపోకలు సజావుగా సాగడంతోపాటు, అమ్మవారి దర్శన సమయంలో రద్దీని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి. తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల నిలిపివేతకు తగిన సౌకర్యాలు కల్పిస్తే భక్తులకు ఇబ్బందులు తగ్గనున్నాయి. దసరా పండుగ వేళ జరగనున్న కోట మైసమ్మ తల్లి జాతర కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం

- వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన 15 మందికి అస్వస్థత
- ఒకరి పరిస్థితి విషమం.. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలింపు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులెందరో?





ప్రజానావ, మెదక్ : మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. నర్సాపూర్–మెదక్ రహదారిలోని వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన సుమారు 15 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు వారిని వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల్లో సాయిరామ్ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనతో పట్టణంలో ఆందోళన నెలకొంది.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎంతమంది?

ప్రస్తుతం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 15 మంది చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ కొందరు చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ ఎంతమంది చికిత్స పొందుతున్నారు? బాధితులందరూ ఒకే రెస్టారెంట్‌లో భోజనం చేశారా? ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్కడ ఆహారం తీసుకున్న వారిలో మరెవరైనా అస్వస్థతకు గురయ్యారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. బాధితుల మొత్తం సంఖ్య, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై అధికారులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

ఆహార నాణ్యతపై అనుమానాలు

వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురైనట్లు సమాచారం రావడంతో ఆహార నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆహారం తయారీలో ఉపయోగించిన ముడి సరుకులు నాణ్యమైనవేనా? వంటగదిలో పరిశుభ్రత పాటించారా? ఆహార పదార్థాలను సరైన విధంగా నిల్వ చేశారా? తాగునీటి నాణ్యతను పరిశీలించారా? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది. బాధితులు అస్వస్థతకు గురికావడానికి ఆహార కలుషితమే కారణమా? లేక ఇతర కారణాలున్నాయా? అన్నది వైద్య పరీక్షలు, ఆహార నమూనాల పరిశీలన, అధికారుల విచారణతోనే తేలాల్సి ఉంది.

ఫుడ్ సేఫ్టీ తనిఖీలు చేపట్టాలి

ఈ ఘటన నేపథ్యంలో నర్సాపూర్ పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై ఆహార భద్రత అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, వంటగదుల పరిశుభ్రత, వంట నూనెల వినియోగం, తాగునీటి స్వచ్ఛత, ఆహార పదార్థాల నిల్వ విధానం, గడువు ముగిసిన పదార్థాల వినియోగం, అవసరమైన అనుమతులు, లైసెన్సులపై క్షుణ్ణంగా పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఘటనలు జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, ముందస్తు తనిఖీల ద్వారా ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమగ్ర విచారణతోనే అసలు కారణం వెలుగులోకి

వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో ఆహారం తీసుకున్న పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వివరాలు సేకరించి, అవసరమైన ఆహార నమూనాలను పరీక్షలకు పంపించాలని సూచిస్తున్నారు. ఘటనకు అసలు కారణాన్ని గుర్తించి, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. నర్సాపూర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనతో ఆహార భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. బాధితులందరి ఆరోగ్య పరిస్థితి, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య, ఘటనకు గల అసలు కారణాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టడంతో పాటు నర్సాపూర్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఆహార భద్రత తనిఖీలను ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మొక్కజొన్నకు రికార్డు ధర

- క్వింటాలు రూ.2,732
- మార్కెట్ చరిత్రలో ఇదే అత్యధికం
- పెరగనున్న ధరలపై ఆశలు

ప్రజానావ, జడ్చర్ల : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్నకు రికార్డు ధర పలికింది. మంగళవారం మార్కెట్‌కు 373 బస్తాల మొక్కజొన్న అమ్మకానికి రాగా, అత్యధికంగా క్వింటాలుకు రూ.2,732 ధర లభించింది. మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకు మొక్కజొన్నకు ఈ స్థాయిలో ధర పలకడం ఇదే తొలిసారి కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం, మొక్కజొన్న సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు సాగు చేసిన పంటలు కూడా వర్షాలు లేక దెబ్బతినడం వల్ల దిగుబడులు తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో మార్కెట్‌లో మొక్కజొన్నకు డిమాండ్ పెరిగి వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం లభిస్తున్న ధరలు రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి. రానున్న రోజుల్లో మొక్కజొన్న ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాంసం విక్రయాల్లో అపరిశుభ్రత

- రోడ్ల పక్కనే జీవాల వధ
- ఈగలు, వీధి కుక్కల స్వైరవిహారం
- పండగ వేళ పెరగనున్న విక్రయాలు
- పట్టించుకోని అధికారులు?



ప్రజానావ, సూర్యాపేట : జిల్లాలోని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో మటన్, చికెన్ విక్రయ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. చాలా దుకాణాల్లో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మాంసం కోసం వధిస్తున్న మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? లేదా? అన్నది నిర్ధారించేందుకు పశువైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వధశాలల నిర్వహణను గాలికొదిలేయడంతో కొందరు వ్యాపారులు ప్రధాన రహదారుల పక్కనే బహిరంగంగా జీవాలను వధిస్తున్నారు. దీంతో రోడ్లపై రక్తం పారుతూ అపరిశుభ్రత నెలకొంటోంది. మాంసంపై ఈగలు వాలుతున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. మాంసం వాసన, పడేసిన వ్యర్థాలతో వీధి కుక్కల సంచారం పెరుగుతోంది. వ్యాపారుల నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాంసం విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి, పరిశుభ్రత నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపాలిటీ, ఆహార భద్రత శాఖ అధికారులు తగిన స్థాయిలో పర్యవేక్షణ చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వారాంతాల్లో భారీగా విక్రయాలు

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో సాధారణ రోజులతో పోలిస్తే వారాంతాలు, పండగల సమయంలో మాంసం విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ సమయాల్లో సుమారు రెండు వేల వరకు జీవాలను వధించి మాంసం విక్రయిస్తున్నట్లు అంచనా. ఇందులో సూర్యాపేటలో సుమారు 750, కోదాడలో 500కు పైగా జీవాలను వధిస్తున్నట్లు సమాచారం. వారాంతాల్లో మాంసం కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో దుకాణాల వద్దకు చేరుకోవడంతో వ్యాపారులు త్వరగా విక్రయాలు పూర్తి చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలున్నాయి. నిమిషాల వ్యవధిలోనే మాంసాన్ని ముక్కలుగా చేస్తున్న క్రమంలో పక్కనే ఈగలు వాలుతున్నా పట్టించుకోవడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. మాంసం నిల్వ, విక్రయాల్లో పరిశుభ్రత పాటించకపోతే ఆహారం కలుషితమై అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పండగ వేళ ప్రత్యేక చర్యలు అవసరం

దసరా పండగ నేపథ్యంలో మాంసం విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మాంసం విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించేలా పర్యవేక్షణ పెంచాలి. ఎముకలు, ఇతర వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా మూతలున్న చెత్త డబ్బాల్లో వేయాలి. మాంసం కోసే మొద్దులపై ఈగలు వాలకుండా శుభ్రమైన వస్త్రంతో కప్పి ఉంచాలి. దుకాణాల పరిసరాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పశువైద్యాధికారులు పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించిన జీవాలను మాత్రమే వధించేలా చూడాలి. మాంసం విక్రయ కేంద్రాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై లారీ బోల్తా..

- భారీగా ట్రాఫిక్ జామ్
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- అధికారుల స్పందన ఆలస్యం
- ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ప్రజానావ, మెదక్ : జాతీయ రహదారిపై లారీ బోల్తా పడటంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మెదక్ జిల్లాలోని వల్లూరు–నార్సింగ్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటనతో సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గమ్యస్థానాలకు చేరుకోవడంలో ఆలస్యం కావడంతో అసౌకర్యానికి గురయ్యారు. లారీ బోల్తా పడిన వెంటనే అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, బోల్తా పడిన లారీని వెంటనే పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. జాతీయ రహదారిపై ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి తీవ్ర గాయాలు

- గుర్తుతెలియని వాహనం ఢీ
- ఆసుపత్రికి తరలింపు

ప్రజానావ, నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామగిరి వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మిర్యాలగూడ టూ టౌన్ ఎస్సై అత్తి సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. కందులవారిగూడెం గ్రామానికి చెందిన సతీష్ ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడకు వెళ్తుండగా రామగిరి వద్ద గుర్తుతెలియని వాహనం ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో సతీష్‌ను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు.



కాంగ్రెస్‌కు ఓట్లేయించిన.. నా పంటనే ఎండబెట్టిండ్రు

- విద్యుత్ సరఫరా సరిగా లేక వరి పంట ఎండిపోతోందంటూ రైతు ఆవేదన
- రెండెకరాల్లో రూ.40 వేల పెట్టుబడి.. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా వీడియో



ప్రజానావ, నాగర్‌కర్నూల్ : విద్యుత్ సరఫరా సక్రమంగా లేక వరి పంట ఎండిపోతోందంటూ నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ రైతు పొలంలోనే కన్నీటి పర్యంతమైన ఘటన చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన తాను ప్రస్తుతం సాగునీరు అందక పంటను కాపాడుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాజిపేట మండలం చంద్రాయన్‌పల్లి తండాకు చెందిన ఇస్లావత్ గోపాల్ తన పొలంలో ఎండిపోతున్న వరి పంటను చూపిస్తూ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లేసినం. నేనే దగ్గరుండి ఓట్లు వేయించిన. ఇప్పుడు నా చేనే ఎండబెట్టిండ్రు' అంటూ గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోజుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ప్రస్తుతం ఐదారు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా అయినప్పటికీ తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో పొలాలకు నీరు అందించలేకపోతున్నామని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డిని కొందరు ప్రశంసిస్తున్నారని, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. రెండెకరాల్లో వరి సాగు చేసేందుకు ఇప్పటికే సుమారు రూ.40 వేల పెట్టుబడి పెట్టానని, విద్యుత్ సమస్యతో పంట ఎండిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నానని కన్నీటిపర్యంతమయ్యారు.

సాగునీటి కోసం రైతుల మధ్య ఘర్షణ

బీమా కాల్వ నీటి పంపిణీపై రెండు గ్రామాల రైతుల గొడవ

ప్రజానావ, కారేపల్లి : తెలంగాణలో సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు రోజూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో సాగునీటి పంపిణీపై రెండు గ్రామాల రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బీమా కాల్వకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు ప్రవహిస్తుండగా, నీటి పంపిణీ విషయంలో మహమ్మదాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల రైతులు గొడవకు దిగారు. తొలుత ఓ రైతును మరో రైతు కిందికి తోసేయడంతో మొదలైన వివాదం క్రమంగా పెరిగి ఘర్షణకు దారితీసింది. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను వారించే ప్రయత్నం చేసినప్పటికీ, వారి ఎదుటే ఇరువర్గాల రైతులు పిడిగుద్దులతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

సర్వీస్ రివాల్వర్‌తో సీఆర్పీఎఫ్ ఎస్ఐ ఆత్మహత్య

- ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా మెట్టగూడెం క్యాంపులో ఘటన
- చికిత్స పొందుతూ మృతి

ప్రజానావ, చర్ల : ఛత్తీస్‌గఢ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. సుక్మా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ దేవానంద్ యాదవ్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి 131వ బెటాలియన్‌కు చెందిన మెట్టగూడెం క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న సమయంలో దేవానంద్ యాదవ్ ఉన్నట్టుండి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నారు. కాల్పుల శబ్దం విన్న తోటి జవాన్లు, అధికారులు అక్కడికి చేరుకుని చూడగా ఆయన రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే ఫీల్డ్ అంబులెన్స్‌లో ఇల్‌మగూడ క్యాంపుకు తరలించి చికిత్స అందించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవానంద్ యాదవ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.



నిమ్మపల్లిలో ఘనంగా పుస్తకావిష్కరణ

- అధ్యాపకుడు పూజం గోపాల్ రచించిన 'సూర్యుడికి పురిటి నొప్పులు'
- 'కుంతలవో! శకుంతలవో!' పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజానావ, కోనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో అధ్యాపకుడు, రచయిత పూజం గోపాల్ రచించిన 'సూర్యుడికి పురిటి నొప్పులు', 'కుంతలవో! శకుంతలవో!' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కమ్మరి స్వప్న నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పర్యావరణవేత్త దుచ్చర్ల సత్యనారాయణ ముఖ్య అతిథిగా, కుల నిర్మూలన పోరాట యోధుడు స్తైలాబ్ బాబు విశిష్ట అతిథిగా, బహుభాషావేత్త నలిమెల భాస్కర్ ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. అన్నవరం దేవేందర్ మరో అతిథిగా పాల్గొన్నారు. సీసాసా అధ్యక్షుడు జానపాల శంకరయ్య, వాసరవేణి పరుశురామ్, కరీంనగర్ డెయిరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావు, శ్రీలత, కోడం కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అతిథులు పూజం గోపాల్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించి ఆయన సాహిత్య కృషిని అభినందించారు. ప్రకృతిని ప్రేమిస్తూ, పరిరక్షిస్తే అది తల్లిలా మనల్ని కాపాడుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గోపాల్ రచనలు భవిష్యత్తు తరాలను ఆలోచింపజేస్తాయని, ప్రకృతిపై అవగాహన పెంపొందించుకుని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విక్కుర్తి హనుమాన్లు, పూజం విమలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలకు నీటిని విడుదల చేయాలి

- చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాల రైతులతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆందోళన

ప్రజానావ, చొప్పదండి: చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి చొప్పదండిలోని ఎస్సారెస్పీ కాలువ రెగ్యులేటర్ వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాకు నీటిని విడుదల చేస్తూ, తమ రెండు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు నీరు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. అందుబాటులో ఉన్న నీటిలో సగం వరకు చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాలకు విడుదల చేసి, మిగిలిన నీటిని పెద్దపల్లి జిల్లాకు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందక పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు అక్కడికి చేరుకుని కాలువలకు నీటిని విడుదల చేశారు.

డా. కందేపి రాణి ప్రసాద్‌కు వేదగిరి రాంబాబు పురస్కారం 2026 ప్రధానం



ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ కు డాక్టర్ వేదగిరి రాంబాబు కథానిక పురస్కారం 2026 అందజేశారు. సంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో సింహప్రసాద్ సాహిత్య సమితి నిర్వహణలో బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ఈ పురస్కారాన్ని రాణి ప్రసాద్ కు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కెవి రమణ చారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త చిత్రకారుడు సుధామ, నేషనల్ బుక్ ట్రస్ట్ సంపాదకులు పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్ల జారీలో అక్రమాలంటూ కార్యదర్శిని నిర్బంధించిన సర్పంచ్

ప్రజానావ, పోతంగల్: నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామపంచాయతీ కార్యదర్శి వ్యవహారశైలిపై సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారని, ఇందుకోసం డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని నిరసిస్తూ మంగళవారం కార్యదర్శిని నిర్బంధించి, గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. సంబంధిత కార్యదర్శికి సోమవారమే బదిలీ అయినట్లు తెలిసిందని సర్పంచ్, పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. అయినప్పటికీ మంగళవారం ఉదయం కార్యాలయానికి వచ్చి, తమకు సమాచారం ఇవ్వకుండా మరికొందరికి ఇంటి నంబర్ల కోసం రసీదులు జారీ చేశారని ఆరోపించారు. బదిలీ అయిన వ్యక్తి ఏ హోదాలో రసీదులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో ఇంటి నంబర్ల కేటాయింపు విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి వ్యవహారశైలిపై గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోలేదని సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. గ్రామపం చాయతీ వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని, ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు జారీ చేసిన అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి వివరణ ఇచ్చే వరకు కార్యాలయానికి వేసిన తాళం తీయబోమని స్పష్టం చేస్తూ అక్కడే బైఠాయించారు.



టెండర్ల నుంచి బిల్లుల వరకు వివాదం!

- పనులు పూర్తయినా బిల్లులు పెండింగ్
- డబ్బులు డిమాండ్ చేశారంటూ గుత్తేదారు ఫిర్యాదు
- టెండర్ నిబంధనల ఉల్లంఘనలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు

ప్రజానావ, హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపాలిటీలో టెండర్ల ప్రక్రియ నుంచి బిల్లుల చెల్లింపుల వరకు పలు అంశాలు వివాదాస్పదంగా మారాయి. టెండర్లలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయంటూ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదులు అందడం చర్చనీయాంశమైంది. పనులు పూర్తిచేసినా బిల్లులు చెల్లించడం లేదని కొందరు గుత్తేదారులు ఆరోపిస్తుండగా, టెండర్ల నిర్వహణలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పనులు పూర్తయినా.. బిల్లుల నిలిపివేత

దమ్మక్కపేటకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ సంతోష్ కుమార్ యాదవ్ నటరాజ్ థియేటర్ నుంచి బీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు టెండర్ ద్వారా పనులు దక్కించుకున్నారు. అగ్రిమెంట్‌లో లేనప్పటికీ స్టీల్‌తో డ్రైనేజీ గోడల నిర్మాణ పనులు సైతం చేయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించి సుమారు రూ.5 లక్షల బిల్లులు నిలిపివేశారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ తనకు నేరుగా కాకుండా మరో పొరుగు సేవల ఉద్యోగి ద్వారా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు అధికారులకు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల విచారణలోనే వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.

టెండర్ల ప్రక్రియపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

మున్సిపాలిటీలో ఇటీవల నిర్వహించిన మరో టెండర్ ప్రక్రియపైనా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు అందింది. టెండర్ గడువును కేవలం మూడు రోజులకే పరిమితం చేయడం, ఇతర గుత్తేదారులకు పోటీలో పాల్గొనే అవకాశం లేకుండా చేయడం, రిజర్వేషన్ నిబంధనల అమలులో లోపాలు, గ్రాంట్ల వివరాలను స్పష్టంగా వెల్లడించకపోవడం వంటి అంశాలను ఫిర్యాదుదారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కౌన్సిల్ తీర్మానం అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియకు విరుద్ధంగా ముందుగానే టెండర్ల ప్రక్రియ చేపట్టారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ అంశాలపై అధికారుల పరిశీలనతోనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



రికార్డుల పరిశీలనతోనే వాస్తవాలు వెలుగులోకి!

టెండర్ల వ్యవహారంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రొక్యూర్‌మెంట్ లాగ్‌లు, టెండర్ నోటిఫికేషన్లు, అగ్రిమెంట్లు, మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) రికార్డులు, బిల్లులు, కౌన్సిల్ సమావేశాల మినిట్స్, పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. టెండర్ గడువును ఎందుకు తగ్గించారు? అగ్రిమెంట్‌లో లేని పనులు ఎందుకు చేయించారు? పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

ఆరోపణల్లో వాస్తవం లేదు: కమిషనర్

ఈ ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ కిషన్ స్పందిస్తూ.. సదరు టెండర్ల ప్రక్రియ గత కమిషనర్ హయాంలో జరిగిందని తెలిపారు. గుత్తేదారు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. డబ్బులు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని, ఆ ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. దీంతో గుత్తేదారు చేసిన ఆరోపణలు, కమిషనర్ ఇచ్చిన వివరణ నేపథ్యంలో సంబంధిత రికార్డుల పరిశీలన, అధికారుల విచారణ అనంతరం ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కోనరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మల్యాల ప్రసాద్

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సమష్టి కృషి చేస్తామని సభ్యుల వెల్లడి

ప్రజానావ, కోనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఆంధ్రప్రభ విలేకరి మల్యాల ప్రసాద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మందాల సంజీవ్ (విజయక్రాంతి), దండు దేవేందర్ (జ్యోతి), చీటీ కళ్యాణ్ (వాస్తవం), ప్రధాన కార్యదర్శిగా దుంపేట నాగరాజు (భారత్ వార్త), సంయుక్త కార్యదర్శులుగా సాసల సురేష్ (మైత్రి న్యూస్), గండి నరేష్ (దిశ), కోశాధికారిగా మార్యాల కిషన్ (ప్రజాజ్యోతి) ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా జొన్నల రాజేందర్ (వార్త), దప్పుల కరుణాకర్ (ప్రజానావ), గౌరవ అధ్యక్షుడిగా రొక్కం దేవరెడ్డి (ఆంధ్రజ్యోతి) బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యవర్గ సభ్యులుగా మంగళగిరి శ్రీనివాస్ (ఉదయం), తడుక శ్రీనివాస్ (సాక్షి), ఉప్పుల పర్ష రాములు, సాసాల గంగాధర్ (నమస్తే తెలంగాణ), దప్పుల నరేష్ (విజన్ ఆంధ్ర), అన్నబోయిన సురేష్ (సిటీ న్యూస్), కస్తూరి తిరుపతిరెడ్డి (జనం సాక్షి), యెల్లె శ్రీనివాస్ (మన తెలంగాణ), ఎర్రవెల్లి నరేష్ (నవతెలంగాణ), తాళ్లపల్లి శ్రీకాంత్ (సూర్య), తాళ్లపెల్లి దిలీప్ (వెలుగు) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, జర్నలిస్టుల సంక్షేమానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి

- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం
- నేర నియంత్రణకు పటిష్ట చర్యలు
- విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిరంతర వాహన తనిఖీలు చేపట్టాలి


ప్రజానావ, సిరిసిల్ల: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఆయా కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు పురోగతి, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ల దాఖలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రతి కేసులో నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే సమయంలో సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయాలని, నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన శోభాయాత్ర ముగిసే వరకు ఉత్సవ నిర్వాహకులు, కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

- 15, 16 తేదీల్లో నిర్వహణ
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల : రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15, 16 ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు (అంటే జాబితాలో చేరని వారు) మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువకులు ఈ నిర్దేశిత కేంద్రాలను సందర్శించి, ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న రోజుల్లో సంబంధిత బీఎల్ఓ లు, బీఎల్ఓ లు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ ఈ నెల 15, 16ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి
- కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
- గ్రేడ్–ఏ రకానికి క్వింటాలుకు రూ.2,461
- సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధర

ప్రజానావ, సిరిసిల్ల: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి పీఏసీఎస్ కార్యదర్శులు, ఐకేపీ, మెప్మా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేడ్–ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15408, హెచ్ఎంటీ సోన, జై శ్రీరామ్, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యుజీఎల్ 44 సన్నవడ్ల రకాలకు క్వింటాలుకు అదనంగా రూ.500 చొప్పున ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో రైతులకు అవసరమైన టెంట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని, టార్పాలిన్లు, ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు, తూకం వేసే యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు ధాన్యంలో తాలు, తప్ప లేకుండా శుభ్రం చేసి, తేమ శాతం 17కు మించకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈసారి ధాన్యం రవాణా చేసే అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా వాహనాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లోనూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని, కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేములవాడలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు


- శ్రీ శక్తి భవాని మండపంలో కుష్మాండాలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు
- విశేష పూజల్లో పాల్గొన్న మహిళలు

ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో శ్రీ శక్తి భవాని అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు కుష్మాండాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపంలో అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు మండప నిర్వాహకులు తెలిపారు. మండపం ముందు భాగంలో ఫౌంటెన్‌తో కూడిన మహా శివలింగాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రి నిర్వహించిన హరికథ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని మండప నిర్వాహకులు సన్మానించి సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా రావికంటి సౌమ్య–సందీప్ దంపతులు అన్నదాన కార్యక్రమానికి, కట్కం శ్రీదేవి–వేణు దంపతులు అల్పాహార వితరణకు సహకరించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. హరికథ బృందానికి తీగల వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.



కూష్మాండ అలంకారంలో అమ్మవారి దర్శనం


ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి లక్ష్మీ గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, జపాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం దేవీభాగవత ప్రవచనం, కన్యకా, సువాసినీ పూజల అనంతరం పల్లకీ సేవ వైభవంగా సాగింది. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



నీటి గుంతలో పడి తొమ్మిదేళ్ల బాలుడి మృతి

- ఇప్పటికే కుమార్తెను కోల్పోయిన తల్లిదండ్రులకు మరో పుత్రశోకం
- దసరా సెలవుల్లో విషాదం

ప్రజానావ, కురవి: దసరా సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చి స్నేహితులతో సరదాగా గడపాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు నీటి గుంతలో పడి మృత్యువాత పడ్డాడు. ఇప్పటికే తొలి సంతానమైన కుమార్తెను కోల్పోయిన తల్లిదండ్రులకు ఇప్పుడు ఒక్కగానొక్క కుమారుడు కూడా దూరమయ్యాడు. ఈ హృదయవిదారక ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ శివారు కాకులబోడు తండాలో బుధవారం చోటుచేసుకుంది. మరిపెడ మున్సిపాలిటీ ఐదో వార్డుకు చెందిన బోడ హరీష్–అరుణ దంపతుల కుమారుడు అక్షిత్ (9) స్థానిక కేరళ గ్లోబల్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో కురవి మండలం నేరడ శివారు కాకులబోడు తండాలో నివసిస్తున్న అమ్మమ్మ, తాత బానోత్ సరోజ, మల్సూర్ ఇంటికి వెళ్లాడు. తండా సమీపంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతంలోని నీటి గుంతల వద్దకు వెళ్లిన అక్షిత్ ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. అతడితో పాటు వెళ్లిన పిల్లలు ఈ విషయాన్ని మేనమామ నరేశ్‌కు తెలియజేయడంతో ఆయన వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే బాలుడు మృతిచెందడంతో స్థానికులు గుంతలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కాకులబోడు తండాకు చేరుకుని కుమారుడి మృతదేహాన్ని మరిపెడకు తీసుకెళ్లారు. సెలవుల్లో ఆనందంగా గడిపేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన మనుమడు విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. హరీష్, అరుణ దంపతులకు మొదట కుమార్తె జన్మించగా, ఆమెను ఇప్పటికే కోల్పోయారు. ఇప్పుడు రెండో సంతానమైన అక్షిత్ కూడా మృతిచెందడంతో ఆ తల్లిదండ్రుల దుఃఖానికి అంతులేకుండా పోయింది. ఇద్దరు పిల్లలను కోల్పోయిన వారి విషాదం తండావాసులను కంటతడి పెట్టించింది.



ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో పాక్ పైలట్లపై నిషేధం

- 31 దేశాల విమాన సిబ్బందిపై ఆంక్షల ప్రభావం
- ఎయిర్ ఫ్రాన్స్ కీలక నిర్ణయం

ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్ తీసుకున్న విమానయాన భద్రతా నిర్ణయం అంతర్జాతీయ విమానయాన రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని దేశాలకు చెందిన విమాన సిబ్బంది తమ దేశానికి వచ్చే, అక్కడి నుంచి వెళ్లే విమానాల్లో విధులు నిర్వహించకుండా ఆంక్షలు విధించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్ ఫ్రాన్స్ సంస్థ ఇజ్రాయెల్‌కు నడిపే విమానాల్లో పాకిస్థాన్ పైలట్లను విధుల్లోకి తీసుకోకూడదని నిర్ణయించినట్లు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల స్లైదుబాయ్ విమాన ఘటన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్ నిబంధనల ప్రకారం, తమతో దౌత్య సంబంధాలు లేని దేశాలకు చెందిన పౌరులు ఇతర దేశాల విమానయాన సంస్థల్లో పనిచేస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్‌కు వచ్చే లేదా అక్కడి నుంచి బయలుదేరే విమానాల్లో విధులు నిర్వహించేందుకు అనుమతి ఉండదని సమాచారం. ఈ ఆంక్షలు పైలట్లతో పాటు ఇతర విమాన సిబ్బందికీ వర్తిస్తాయని తెలుస్తోంది. పాకిస్థాన్‌కు చెందిన పైలట్ అమెరికా లేదా ఫ్రాన్స్ వంటి మరో దేశ విమానయాన సంస్థలో పనిచేస్తున్నా, ఇజ్రాయెల్‌కు వెళ్లే విమానంలో విధులు నిర్వహించడంపై పరిమితులు వర్తించనున్నాయి. ఈ నిషేధం వల్ల పాకిస్థాన్‌తో పాటు అల్జీరియా, ట్యునీషియా, ఇరాన్, ఒమన్, సౌదీ అరేబియా, నైగర్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, బ్రూనై, కొమొరోస్, క్యూబా, జిబౌటి, ఇండోనేసియా, ఇరాక్, కువైట్, లెబనాన్, లిబియా, మలేసియా, మాల్దీవులు, మాలి, మౌరిటానియా, ఉత్తర కొరియా, ఖతార్, సోమాలియా, సూడాన్, సిరియా, వెనిజువెలా, యెమెన్ తదితర దేశాలకు చెందిన సిబ్బందిపై ప్రభావం పడే అవకాశం ఉందని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే, ఈ జాబితాలోని దేశాల సంఖ్య, వర్తించే నిబంధనలు, ఆంక్షల పరిధిపై అధికారిక ధ్రువీకరణ అవసరం. ప్రస్తుతం ఎయిర్ ఫ్రాన్స్ తీసుకున్న నిర్ణయం ఇతర అంతర్జాతీయ విమానయాన సంస్థలపైనా ప్రభావం చూపుతుందా? ఇజ్రాయెల్ నిబంధనలను ఇతర సంస్థలు కూడా అమలు చేస్తాయా? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది. అయితే, ఇతర దేశాల విమానయాన సంస్థలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాయనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

రష్యా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపాటు

- ఉక్రెయిన్‌లో ఆరు లక్షల మందికి నిలిచిన విద్యుత్తు సరఫరా
- కీవ్‌లో ముగ్గురు మృతి, 21 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల కారణంగా సుమారు ఆరు లక్షల మంది విద్యుత్తు సరఫరా లేక అంధకారంలో చిక్కుకున్నారు. కీవ్‌లోని కీలక ఇంధన కేంద్రంతో పాటు ఖార్కివ్ నగరంలోని విద్యుత్తు కేంద్రంపైనా రష్యా దాడులు చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడించారు. తాజా దాడుల్లో కీవ్‌లో ముగ్గురు మృతిచెందగా, మరో 21 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అత్యవసర సేవల విభాగం తెలిపింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపివేసేందుకు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రతిపాదన అమలవుతున్నట్లు కనిపించడం లేదు. మరోవైపు, కీవ్, ఖార్కివ్ నగరాల్లో ఉక్రెయిన్ సైన్యం ఉపయోగించే సమాచార వ్యవస్థలు, ఇంధన కేంద్రాలపై దాడులు చేసినట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొంది. రష్యాలోని పలు ప్రాంతాల్లో 902 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, రాత్రికి రాత్రే రష్యా 39 బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో పాటు 128 డ్రోన్లను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. వీటిలో నాలుగు క్షిపణులు, 115 డ్రోన్లను కూల్చివేసినట్లు పేర్కొంది. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న దాడులతో విద్యుత్తు మౌలిక సదుపాయాలు దెబ్బతింటుండగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెట్రోల్ బంకుల్లో యూపీఐ చెల్లింపులకు బ్రేక్?

- ఎండీఆర్ భారాన్ని వ్యతిరేకిస్తూ పెట్రోలియం డీలర్ల నిర్ణయం
- వాహనదారులకు తప్పనున్న డిజిటల్ చెల్లింపుల సౌకర్యం

న్యూఢిల్లీ: మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానాన్ని వ్యతిరేకిస్తూ ఇకపై యూపీఐ చెల్లింపులను అంగీకరించకూడదని నిర్ణయించినట్లు పెట్రోలియం డీలర్ల ప్రతినిధులు తెలిపారు. పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లకు డిజిటల్ చెల్లింపులు చేసే వాహనదారులకు ఈ నిర్ణయంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ఎండీఆర్ భారాన్ని భరించలేక ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. చమురు కంపెనీల ఏకపక్ష నిర్ణయాల కారణంగా పెట్రోలియం డీలర్లు ఇప్పటికే తక్కువ మార్జిన్ లాభాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెట్రోలియం డీలర్ల సంఘం పంజాబ్ అధ్యక్షుడు పరంజిత్ సింగ్, అధికార ప్రతినిధి మాంటీ సెహగాల్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో అదనపు చార్జీల భారాన్ని భరించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ఎండీఆర్ విధానంపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ నిర్ణయం ఏ ప్రాంతాల్లో, ఎప్పటి నుంచి అమలవుతుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

పెళ్లి పేరుతో యువతిపై అత్యాచారం

- జిమ్ ట్రైనర్ అరెస్ట్
- నిందితుడి ఫోన్‌లో అభ్యంతరకర వీడియోలు
- తల్లి, బంధువుపైనా కేసు

ముంబై: మహారాష్ట్రలోని నాలసోపారాలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి 23 ఏళ్ల యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 22 ఏళ్ల జిమ్ ట్రైనర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆరిఫ్ షేక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి మొబైల్‌లో పలువురు మహిళలకు సంబంధించిన అభ్యంతరకర వీడియోలు లభించినట్లు పోలీసులు తెలిపారు. 70 నుంచి 80 మంది మహిళలను ఇదే విధంగా వలలో వేసుకుని, వారి వీడియోలను వెబ్‌సైట్లకు విక్రయించినట్లు బాధితురాలు ఆరోపించింది. బాధితురాలిపై మతం మారాలని ఒత్తిడి తెచ్చి వేధించినట్లు, నిందితుడి బంధువు లైంగిక దాడికి యత్నించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసులో నిందితుడి తల్లి, బంధువుపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. మొబైల్‌లో లభించిన వీడియోలను పరిశీలిస్తూ, ఇతర బాధితులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పోప్ లియోకు ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స

- కుడి ఊపిరితిత్తిలో కణితి తొలగింపు
- విజయవంతంగా శస్త్రచికిత్స



వాటికన్: పోప్ లియో ఎఐవీకు ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సలో భాగంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయన కుడి ఊపిరితిత్తి కింది భాగంలో పెరిగిన కణితిని వైద్యులు తొలగించారు. మంగళవారం సుమారు 90 నిమిషాల పాటు శస్త్రచికిత్స కొనసాగినట్లు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని, అనంతరం పోప్ మేల్కొన్నారని తెలిపాయి. వైద్య పరీక్షల్లో ఆయనకు పల్మనరీ అడెనోకార్సినోమా ఉన్నట్లు గుర్తించడంతో ఈ చికిత్స చేపట్టారు. కణితి కారణంగా క్యాన్సర్ ఇతర భాగాలకు వ్యాపించిందా లేదా అన్నది నిర్ధారించేందుకు మరిన్ని పరీక్షలు నిర్వహించనున్నారు. పోప్‌ను సుమారు మూడు గంటల పాటు ఆపరేషన్ గదిలో ఉంచినట్లు సమాచారం. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఎలాంటి అసౌకర్యం గురించి ఫిర్యాదు చేయలేదని, భోజనం కావాలని అడిగినట్లు వాటికన్ వర్గాలు పేర్కొన్నాయి. రోమ్‌లోని జెమేలి ఆసుపత్రి పదో అంతస్తులో ఆయన మరికొన్ని రోజుల పాటు చికిత్స పొందనున్నారు. ఈ నేపథ్యంలో పోప్ నిర్వహించే సామూహిక ప్రార్థనలను అక్టోబర్ 20వ తేదీ వరకు రద్దు చేశారు. వచ్చే నెలలో చేపట్టాల్సిన దక్షిణ అమెరికా పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదు.

అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హౌతీల క్షిపణి దాడి

- పరిపాలనా భవనంలోని మూడు అంతస్తులు ధ్వంసం
- భారతీయులకు ఎంబసీ హెచ్చరిక



రియాద్: సౌదీ అరేబియాలో హౌతీల దాడులు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆ దేశంలోని తూర్పు నగరం ధహ్రాన్‌లో ఉన్న జాతీయ చమురు సంస్థ అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై మంగళవారం బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడి జరిగినట్లు సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కార్యాలయ ప్రాంగణంలోని ఓ పరిపాలనా భవనంపై దాడి జరగడంతో పై మూడు అంతస్తులు దెబ్బతిన్నాయని, వాటిలో సంస్థ సీఈవో కార్యాలయం కూడా ఉన్నట్లు తెలిపింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, అగ్నిమాపక సిబ్బంది మంటలను వెంటనే అదుపులోకి తీసుకొచ్చారని అధికారులు పేర్కొన్నారు. చమురు కేంద్రాలకు సిబ్బంది, పౌరులు దూరంగా ఉండాలని హౌతీలు హెచ్చరించిన కొద్దిసేపటికే ఈ దాడి జరగడం గమనార్హం.

దాడులు కొనసాగిస్తాం..

చమురు సంస్థలు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, అందువల్లే వాటిని లక్ష్యంగా చేసుకుంటున్నామని హౌతీలు ప్రకటించారు. సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు. యెమెన్‌పై సౌదీ దాడులను నిలిపివేయకపోతే తమ ప్రతిస్పందన మరింత తీవ్రంగా ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో సాధారణ పౌరులు తాము లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

భారతీయులకు ఎంబసీ సూచనలు

సౌదీ అరేబియాలో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అక్కడి భారత రాయబార కార్యాలయం సూచించింది. వైమానిక దాడులు జరిగే సమయంలో ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించింది. రాయబార కార్యాలయం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని తెలిపింది. దాడులకు సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయవద్దని కోరింది. ఏదైనా సహాయం అవసరమైతే రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది. సౌదీ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎంబసీ వెల్లడించింది.

బీజేపీకి ఓట్లు పెంచుతా

- ఒడిశా గవర్నర్ వ్యాఖ్యలతో వివాదం
- రాజ్యాంగ పదవిలో ఉంటూ పార్టీకి అనుకూలంగా మాట్లాడటమేంటని బీజేడీ విమర్శలు

భువనేశ్వర్: ఒడిశా గవర్నర్‌గా కొత్తగా నియమితులైన బ్రజ్ మోహన్ రామ్ వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. రాష్ట్రంలో బీజేపీకి మరిన్ని ఓట్లు సాధించేందుకు, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన ప్రకటించడంపై బీజేడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ నిష్పాక్షికంగా వ్యవహరించాలనే సూత్రానికి ఈ వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయని బీజేడీ అధికార ప్రతినిధి లెనిన్ మొహంతి బుధవారం విమర్శించారు. గవర్నర్ వ్యాఖ్యలు తమను దిగ్భ్రాంతికి గురిచేశాయని పేర్కొన్నారు. రాంచీలో ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బ్రజ్ మోహన్ రామ్ మాట్లాడుతూ.. గతంలో జార్ఖండ్‌లో బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆ విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశానని తెలిపారు. ఒడిశాలోనూ బీజేపీ ఎస్సీ మోర్చాను మరింత చురుగ్గా పనిచేసేలా చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ దిశగా కృషి చేస్తానని, రాష్ట్రంలో పార్టీకి అధిక ఓట్లు సాధించేలా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. తనను నిజాయితీపరుడైన, విధేయుడైన బీజేపీ కార్యకర్తగా అభివర్ణించుకున్న ఆయన.. తన సేవలను గుర్తించి రాజ్యాంగబద్ధమైన పదవికి ఎంపిక చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో గవర్నర్ పదవి నిష్పాక్షికతపై రాజకీయంగా చర్చ మొదలైంది.

అంకిత హత్య కేసు..

గవర్నర్ నియామకంపై తల్లిదండ్రుల నిరసన

మరోవైపు, ఉత్తరాఖండ్‌లో సంచలనం సృష్టించిన అంకితా భండారీ హత్య కేసు మరోసారి చర్చకు వచ్చింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దుష్యంత్ కుమార్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ అంకిత తల్లిదండ్రులు బుధవారం న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద నిరసన తెలిపారు. రిషికేశ్‌లోని వనంతరా రిసార్టులో రిసెప్షనిస్టుగా పనిచేసిన 19 ఏళ్ల అంకిత 2022 సెప్టెంబర్ 18న హత్యకు గురయ్యారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దాఖలు చేసిన చార్జిషీట్ ప్రకారం.. లైంగిక సేవలు అందించాలంటూ ఆమెపై ఒత్తిడి తీసుకురాగా, అందుకు నిరాకరించడంతో హత్యకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ నాయకుడు వినోద్ ఆర్య కుమారుడు పులకిత్ ఆర్య ఈ రిసార్ట్ మేనేజర్‌గా వ్యవహరించారు. ఈ కేసుకు సంబంధించి దుష్యంత్ కుమార్ గౌతమ్ పేరు కూడా చార్జిషీట్‌లో ఉందని అంకిత తల్లిదండ్రులు పేర్కొన్నారు.

దర్యాప్తు పూర్తయ్యే వరకు నియామకం వద్దు

అంకిత హత్య కేసులో సీబీఐ దర్యాప్తు పూర్తయ్యే వరకు దుష్యంత్ కుమార్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించవద్దని అంకిత తండ్రి వీరేంద్ర సింగ్ భండారీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టాలని అంకిత తల్లి సోనీ దేవి డిమాండ్ చేశారు. గవర్నర్‌గా నియమితులయ్యారనే వార్త విన్నప్పుడు తీవ్ర వేదనకు గురయ్యామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను రాష్ట్రపతి అర్థం చేసుకుంటారనే నమ్మకం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అంకిత కుటుంబం న్యాయం కోసం చేస్తున్న పోరాటం మరోసారి తెరపైకి వచ్చింది.

జర్మనీలో అగ్నిప్రమాదం

- ముగ్గురు భారతీయులు మృతి
- ఐదుగురికి గాయాలు

జర్మనీ: జర్మనీలోని బోచుమ్ నగరంలో జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతిచెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. హోస్ట్‌ఫెడ్ ప్రాంతంలోని ఓ నివాస భవనంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. భవనంలోని మూడో అంతస్తులో జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేసిన పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా అదే భవనంలో నివసిస్తున్న 41 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వ్యక్తి రొమేనియా దేశస్థుడని స్థానిక మీడియా వెల్లడించింది. అయితే మృతులు, క్షతగాత్రులకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించలేదు. అగ్నిప్రమా దానికి గల కారణాలు, ఘటన వెనుక ఉన్న పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తోటి విద్యార్థుల కులం, ర్యాంకులు అడగొద్దు

- ఐఐటీ బాంబే కీలక ఆదేశాలు
- వివక్షకు తావివ్వొద్దని స్పష్టీకరణ

ముంబై: తోటి విద్యార్థుల కులం, సామాజిక వర్గం, ప్రవేశ పరీక్షల ర్యాంకుల వివరాలు అడగొద్దని ఐఐటీ బాంబే కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి విద్యార్థులందరికీ ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందించింది. ఇటీవల రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఈ ఘటనపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 26 రోజులుగా సంస్థ ప్రధాన గేటు వద్ద ఉన్న 'జస్టిస్ కార్నర్'లో విద్యార్థులు నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఐఐటీ విద్యార్థి వ్యవహారాల డీన్ కార్యాలయం ఈ ప్రకటన విడుదల చేసింది. తోటి విద్యార్థి కులం లేదా సామాజిక వర్గం గురించి ఆరా తీయడం వివక్షకు దారితీయవచ్చని సంస్థ స్పష్టం చేసింది. ప్రశ్న అడిగేవారికి అది సాధారణమైన విషయంగా అనిపించినప్పటికీ, ఎదుటివారికి మాత్రం అవమానకరంగా లేదా వివక్షగా అనిపించే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల ఇలాంటి ప్రశ్నలకు దూరంగా ఉండాలని సూచించింది. అలాగే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియా ర్యాంకులు, గేట్ పరీక్ష స్కోర్ల గురించి కూడా తోటి విద్యార్థులను అడగవద్దని ఆదేశించింది. విద్యార్థుల మధ్య సమానత్వం, పరస్పర గౌరవం పెంపొందించడం, క్యాంపస్‌లో వివక్షకు తావులేకుండా చూడటమే ఈ సూచనల ఉద్దేశంగా తెలుస్తోంది. విద్యార్థి ఆత్మహత్య ఘటన నేపథ్యంలో కొనసాగుతున్న నిరసనల మధ్య ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కార్లకు బీఎస్–7 ఉద్గార ప్రమాణాలు

న్యూఢిల్లీ: దేశంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేయనుంది. కొత్త కార్లు, ఎస్‌యూవీలకు మరింత కఠినమైన బీఎస్–7 ఉద్గార ప్రమాణాలను 2029 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు అక్టోబర్ 12న ముసాయిదా గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు సమాచారం. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం 2029 ఏప్రిల్ నుంచి 2035 ఏప్రిల్ వరకు ఆరేండ్ల వ్యవధిలో మూడు దశల్లో కొత్త ఉద్గార ప్రమాణాలను అమల్లోకి తీసుకురానున్నారు. దేశంలో కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసే క్రమంలో కేంద్రం గతంలో బీఎస్–5 ప్రమాణాలను దాటవేసి, 2020 ఏప్రిల్ నుంచి నేరుగా బీఎస్–6 ఉద్గార ప్రమాణాలను అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పుడు బీఎస్–7 ప్రమాణాల అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం ద్వారా వాహన కాలుష్యాన్ని మరింత తగ్గించే దిశగా అడుగులు వేస్తోంది. అయితే, ముసాయిదా నోటిఫికేషన్‌పై తుది నిర్ణయం, అమలు విధివిధానాలు అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

వలసదారులకు ట్రంప్ సర్కారు మరో షాక్

- వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ పొడిగింపునకు స్వస్తి
- భారతీయ నిపుణులపైనా ప్రభావం

న్యూఢిల్లీ: అమెరికాలో పనిచేస్తున్న విదేశీ వలసదారులకు ట్రంప్ ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. వర్క్ పర్మిట్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకొని ఆమోదం కోసం ఎదురుచూస్తున్న కొంతమందికి కల్పిస్తున్న ఉపాధి అనుమతి పత్రం (ఈఏడీ) ఆటోమేటిక్ పొడిగింపు సదుపాయాన్ని నిలిపివేసింది. ఈ మేరకు 2025 అక్టోబర్‌లో ప్రవేశపెట్టిన విధానాన్ని శాశ్వతం చేసే నిబంధనలను అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ఖరారు చేసింది. గతంలో అర్హులైన దరఖాస్తుదారులు తమ వర్క్ పర్మిట్ గడువు ముగిసిన తర్వాత కూడా గరిష్ఠంగా 540 రోజుల వరకు పని కొనసాగించేందుకు అవకాశం ఉండేది. తాజా నిబంధనలతో ఈ వెసులుబాటును తొలగించారు. ఈ నిర్ణయం అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న విదేశీ పౌరులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉపాధి అనుమతి పత్రాలపై ఆధారపడి పనిచేస్తున్న భారతీయ నిపుణులు, హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చు. వర్క్ పర్మిట్ పునరుద్ధరణ దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన ఉద్యోగంలో కొనసాగేందుకు అనుమతి లభించదని తాజా నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. సంబంధిత దరఖాస్తుకు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) ఆమోదం లభించిన తర్వాతే అర్హత ప్రకారం ఉద్యోగాన్ని కొనసాగించాల్సి ఉంటుంది.

కొత్త నిబంధనలతో మార్పులివీ..

సవరించిన విధానం ప్రకారం 2025 అక్టోబర్ 30న లేదా ఆ తర్వాత దాఖలు చేసిన వర్క్ పర్మిట్ పునరుద్ధరణ దరఖాస్తులకు సాధారణంగా ఆటోమేటిక్ పొడిగింపు వర్తించదు. దీంతో ప్రస్తుత అనుమతి పత్రం గడువు ముగిసేలోగా కొత్త పత్రానికి ఆమోదం పొందడం దరఖాస్తుదారులకు కీలకంగా మారింది. గడువు ముగిసే సమయానికి పునరుద్ధరణ దరఖాస్తు ఆమోదం పొందకపోతే, సంబంధిత వ్యక్తులు ఉద్యోగానికి తాత్కాలికంగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. అయితే, కొన్ని ప్రత్యేక కేటగిరీలకు మినహాయింపులు వర్తించే అవకాశం ఉంది. తాజా నిబంధనల పరిధి, తమ వీసా కేటగిరీకి వర్తించే నిబంధనలను సంబంధిత దరఖాస్తుదారులు అధికారిక మార్గదర్శకాల ద్వారా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

రైల్వే ఉద్యోగులకు పండుగ బోనస్

- 11.40 లక్షల మందికి 78 రోజుల వేతనం
- ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.17,951



న్యూఢిల్లీ: పండుగ వేళ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అర్హులైన సుమారు 11.40 లక్షల మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ (పీఎల్‌బీ) చెల్లించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 2,009.61 కోట్లను కేటాయించనుంది. ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు బోనస్ అందనుంది. ఈ బోనస్ వల్ల ట్రాక్‌మెయింటెనర్లు, లోకోపైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బందితో పాటు ఇతర గ్రూప్–సీ ఉద్యోగులకు ప్రయోజ నం చేకూరనుంది. పండుగల సమయం లో ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కల్పించడంతో పాటు, రైల్వే సిబ్బంది సేవలను గుర్తించడం ఈ నిర్ణయం లక్ష్యంగా ఉంది. మరోవైపు, 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత రైల్వే రికార్డు స్థాయిలో 1,670 మిలి యన్ టన్నుల సరుకు రవాణా చేపట్టిన ట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో సుమారు 7.41 బిలియన్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. రైల్వే కార్యకలాపాల్లో ఉద్యోగుల పాత్రను గుర్తిస్తూ కేంద్రం బోనస్‌కు ఆమోదం తెలిపింది.

కాశీ విశ్వనాథ ఆలయంలో బంగారం మాయం?

- ఆలయ శిఖరంతో పాటు పలు చోట్ల బంగారం కనిపించడం లేదంటూ ఆరోపణలు
- పీఎంవోకు న్యాయవాది లేఖ



వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని ప్రసిద్ధ కాశీ విశ్వనాథ ఆలయంలో బంగారం చోరీకి గురైందంటూ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోని ఈ ఆలయంలో బంగారం కనిపించడం లేదని వారణాసి బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది నిత్యానంద్ రాయ్ ఆరోపించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి కార్యాలయానికి (పీఎంవో) లేఖ రాశారు. ఆలయ శిఖరంతో పాటు పలు ప్రాంతాల్లో బంగారం కనిపించడం లేదని, సంబంధిత ప్రదేశాలకు రంగులు వేసి ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ఆలయ యాజమాన్యం ప్రయత్నిస్తున్నదని ఆయన తన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణలు ఆలయ నిర్వహణపై చర్చకు దారితీశాయి. అయితే, బంగారం మాయమైనట్లు వచ్చిన ఆరోపణలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. ఆలయ యాజమాన్యం స్పందన, సంబంధిత అధికారుల విచారణ వివరాలు వెల్లడైతేనే ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

షాంఘై మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్లో మెద్వెదేవ్

- సిట్సిపాస్‌పై 6–4, 7–5తో విజయం
- వరుసగా మూడో ఏడాది చివరి ఎనిమిది మందిలో చోటు



షాంఘై: షాంఘై మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో రష్యా స్టార్, ఐదో సీడ్ డానిల్ మెద్వెదేవ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. చిరకాల ప్రత్యర్థి స్టెఫానోస్ సిట్సిపాస్‌పై 6–4, 7–5తో గెలిచాడు. ఈ టోర్నీలో వరుసగా మూడేళ్ల చివరి ఎనిమిది మందిలో నిలిచిన నాలుగో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు రోజర్ ఫెదరర్, నొవాక్ జకోవిచ్, ఆండీ ముర్రే మాత్రమే ఈ ఘనత సాధించారు. గతంలో వీరిద్దరి మధ్య పలుమార్లు వాగ్వాదాలు చోటుచేసుకున్నప్పటికీ, తాజా పోరులో ఎలాంటి వివాదం లేకుండానే మెద్వెదేవ్ విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన 20 ఏళ్ల రఫేల్ జోడార్ తొలి సెట్ కోల్పోయినా పుంజుకుని నెదర్లాండ్స్ ఆటగాడు బోటిక్ వాన్ డి జాండ్‌షుల్ప్‌పై 6–7(4), 6–4, 6–2తో గెలిచాడు. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ తొలి సెట్ ఓడిన తర్వాత విజయం సాధించడం విశేషం. తదుపరి అతడు కాస్పర్ రూడ్‌తో తలపడనున్నాడు.

రూడ్ ముందంజ

నాలుగో సీడ్ ఫెలిక్స్ అగర్–అలియాసిమ్ మోకాలి గాయం అనుమానంతో తొలి సెట్‌లో 2–5తో వెనుకబడిన సమయంలో మ్యాచ్ నుంచి వైదొలగడంతో రూడ్ ముందంజ వేశాడు. కార్లోస్ అల్‌కరాజ్‌ను ఓడించిన జిజూ బెర్గ్స్‌తో టామీ పాల్ తలపడనుండగా, విజేత మెద్వెదేవ్‌తో ఆడతాడు. టోర్నీ ఎగువ డ్రాలో టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్–అలెక్స్ డి మినార్, ఆర్థర్ గియా–అలెజాంద్రో దేవిడోవిచ్ ఫోకినా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఖరారయ్యాయి.

ఉప్పల్‌లో ఓడారు

- నాలుగో టీ20లో భారత్ ఓటమి
- హోప్ అజేయ శతకం
- సిరీస్ సమం చేసిన వెస్టిండీస్

హైదరాబాద్: పొట్టి క్రికెట్లో వెస్టిండీస్‌తో అంత తేలిక కాదని మరోసారి రుజువైంది. భారత్‌కు వన్డే సిరీస్ కోల్పోయాక.. టీ20 సిరీస్‌లో గట్టి పోటీనిస్తున్న కరీబియన్ జట్టు, సిరీస్‌ను 2–2తో సమం చేసి ఫలితాన్ని చివరి పోరుకు మళ్లించింది. భారత బౌలర్లపై పగబట్టినట్లుగా చెలరేగిపోతున్న విండీస్ కెప్టెన్ షై హోప్.. ఈ పర్యటనలో నాలుగో శతకం బాదేశాడు. మిగతా బ్యాటర్లూ ధాటిగా ఆడడంతో ఉప్పల్ స్టేడియంలో టీమ్‌ఇండియాకు 248 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన వెస్టిండీస్.. బంతితోనూ రాణించి విజయాన్నందుకుంది. విధ్వంసక అర్ధశతకంతో సంజు శాంసన్ బలమైన పునాది వేసినా.. తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ, నితీశ్‌కుమార్ రెడ్డి కూడా పోరాడినా భారత్‌కు ఓటమి తప్పలేదు. ఇక సిరీస్ ఫలితం తేలేది చిన్నస్వామి స్టేడియంలోనే.

తొలి టీ20 మనది.. రెండోది వాళ్లది. మూడో టీ20లో భారత్ పైచేయి సాధించింది. ఇప్పుడు నాలుగో మ్యాచ్‌ను విండీస్ సొంతం చేసుకుంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షై హోప్ (102 నాటౌట్; 50 బంతుల్లో 4×4, 9×6) అజేయ శతకానికి.. షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ (49 నాటౌట్; 26 బంతుల్లో 4×4, 3×6), హెట్‌మయర్ (33; 12 బంతుల్లో 4×4, 2×6) మెరుపులు తోడవడంతో మొదట విండీస్ 3 వికెట్లకు 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం టీమ్‌ఇండియా 19.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. సంజు శాంసన్ (56; 23 బంతుల్లో 6×4, 4×6)తో పాటు తిలక్ వర్మ (43; 25 బంతుల్లో 2×4, 3×6), నితీశ్‌కుమార్‌రెడ్డి (41; 20 బంతుల్లో 1×4, 4×6) రాణించారు. కీమో పాల్ (5/41), గుడాకేశ్ మోటీ (2/13) భారత్‌ను దెబ్బ తీశారు. నిర్ణయాత్మక చివరి టీ20 శనివారం బెంగళూరులో జరుగుతుంది.


ఆరంభం అదిరింది కానీ..: ఈ సిరీస్ రెండో మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తే 10 బంతులుండగానే ఛేదించేసింది విండీస్. బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలమైన ఉప్పల్‌లో 248 పరుగుల ఛేదన అంటే మరీ కష్టమేమీ కాదు. కావాల్సిందల్లా బలమైన ఆరంభమే. సంజు శాంసన్ జట్టు కోరుకున్న పునాదే వేశాడు. రెండో ఓవర్లో (షమార్) 4, 6, 6.. మూడో ఓవర్లో (చేజ్) 4, 6, 2, 2, 6, 4.. నాలుగో ఓవర్లో (షెపర్డ్) 4, 4.. ఇదీ సంజు విధ్వంసం సాగిన తీరు. అద్భుత టైమింగ్‌తో అతను బంతిని పదే పదే బౌండరీకి తరలిస్తుంటే ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. 3.4 ఓవర్లకే 20 బంతుల్లోనే అతడి అర్ధశతకం పూర్తయింది. 4 ఓవర్లకే స్కోరు 60 పరుగులకే చేరుకుంది. మరో ఓపెనర్ అభిషేక్ (29) అప్పటికి 3 బంతులే ఆడాడు. అయితే తర్వాతి ఓవర్లో భారత్‌కు డబుల్ షాక్ తగిలింది. తొలి బంతికి సంజును, నాలుగో బంతికి ఇషాన్ (6)ను ఔట్ చేసి భారత్‌ను గట్టి దెబ్బ తీశాడు కీమో పాల్. ఇక్కడి నుంచి ఏ దశలోనూ భారత్ గెలుపు బాటలో సాగలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16) విఫలమయ్యాడు.



అభిషేక్ శర్మ మామూలుగా 12వ ఓవర్ వరకు ఉన్నాడంటే సెంచరీ కొట్టేయాలి. కానీ అతను 24 బంతులాడి 29 పరుగులే చేశాడు. స్పిన్నర్ మోటీ 12వ ఓవర్లో అభిషేక్, నమన్ ధీర్ (0)లను ఔట్ చేయడంతో భారత్ 130/5తో ఇబ్బందుల్లో పడింది. అయితే ఆశలు సన్నగిల్లిన స్థితిలో తిలక్, నితీశ్ గొప్పగా పోరాడారు. ఒత్తిడిలో ఇద్దరూ భారీ షాట్లు ఆడారు. ముఖ్యంగా నితీశ్ సూపర్ సిక్సర్లతో అలరించాడు. అయితే ఈ జోడీ ఎంతగా పోరాడినా.. సమీకరణం అందుబాటులోకి రాలేదు. 19 బంతుల్లో 48 పరుగులు చేయాల్సిన స్థితిలో తిలక్ ఔటైపోయాడు. 19వ ఓవర్లో కీమో పాల్.. నితీశ్, ప్రిన్స్ (0), అక్షర్ (3)లను ఔట్ చేసి 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేయడంతో టీమ్‌ఇండియా పనైపోయింది. అర్ష్‌దీప్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో 3 బంతులుండగానే భారత్ ఇన్నింగ్స్ ముగిసిపోయింది.

శ్రేయస్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంకు!

- బ్యాటర్ల జాబితాలో నాలుగో స్థానానికి టీమిండియా కెప్టెన్
- టాప్–4లో ముగ్గురు భారత ఆటగాళ్లు



దుబాయ్: ఐసీసీ తాజా టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మూడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లోనే అత్యుత్తమమైన నాలుగో ర్యాంకుకు చేరుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోరులోనే శతకం సాధించడం అతడికి కలిసొచ్చింది. లక్నోలో జరిగిన ఆ మ్యాచ్‌లో అయ్యర్ తన తొలి టీ20 అంతర్జాతీయ సెంచరీ నమోదు చేశాడు. టాప్–4లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉండటం విశేషం. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో ర్యాంకులో ఉన్నాడు. పాకిస్తాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. శ్రీలంకతో సిరీస్‌లో రాణించడంతో అతడు కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్ సాధించినట్లు ఐసీసీ తెలిపింది.

ర్యాంకింగ్స్‌లో ఇతరులకూ పురోగతి

శ్రీలంక ఆటగాడు కుశాల్ మెండిస్ మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 23వ ర్యాంకుకు చేరాడు. వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 13 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 24వ స్థానాన్ని దక్కించుకున్నాడు. భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని సంయుక్తంగా 27వ ర్యాంకులో నిలిచాడు. పాకిస్తాన్ యువ ఆటగాడు మాజ్ సాదఖత్ కూడా ర్యాంకింగ్స్‌లో భారీ పురోగతి సాధించాడు. శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో చూపిన ప్రతిభతో టాప్–100 వెలుపలి నుంచి 45వ స్థానానికి చేరుకున్నాడు.

హైదరాబాద్‌కు నటరాజన్

ముంబయి: ఎడమచేతి వాటం పేసర్ నటరాజన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తిరిగొచ్చాడు. ఐపీఎల్ ట్రేడ్‌లో భాగంగా సన్‌రైజర్స్ అతణ్ని దిల్లీ క్యాపిటల్స్ నుంచి తీసుకుంది. నటరాజన్‌కు రూ.5 కోట్లు చెల్లించనుంది. 2025 ఐపీఎల్ వేలంలో దిల్లీ క్యాపిటల్స్ రూ.10.75 కోట్లకు నటరాజన్‌ను కొనుక్కుంది. అతడు గతంలో 2020 నుంచి 2024 వరకు అయిదు సీజన్లలో సన్‌రైజర్స్‌కు ఆడాడు. 2024లో 19 వికెట్లతో ఆ జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు 2026 సీజన్లో సన్‌రైజర్స్‌కు ఆడిన లెగ్‌స్పిన్నర్ జీషన్ అన్సారీని దిల్లీ క్యాపిటల్స్ తీసుకుంది. జీషన్‌కు అతడి ప్రస్తుత ఫీజు రూ.40 లక్షలనే దిల్లీ కూడా చెల్లిస్తుంది.

డీసీకి టైటిల్ అందించడమే లక్ష్యం

- గంగూలీతో కలిసి జట్టులో ఆత్మవిశ్వాసం నింపుతాం
- ముందుగా ప్లేఆఫ్స్.. ఆపై ఛాంపియన్‌షిప్‌పై గురి: యువరాజ్



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఇప్పటివరకు టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్‌ను విజేతగా నిలపడమే తమ లక్ష్యమని ఆ జట్టు సహాయ, బ్యాటింగ్ కోచ్ యువరాజ్ సింగ్ తెలిపాడు. ప్రధాన కోచ్ సౌరవ్ గంగూలీతో కలిసి ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచి, తొలుత ప్లేఆఫ్స్‌కు చేర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేదు. 2021 తర్వాత ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేదు. అయితే గత వైఫల్యాలను పట్టించుకోకుండా, ఒత్తిడిలోనూ సమర్థంగా ఆడే జట్టును నిర్మించడంపై దృష్టి పెడతానని యువరాజ్ చెప్పాడు. ఆటగాళ్లు తమ సామర్థ్యాలను నమ్ముకూ, సాధనతో ఆటను మెరుగుపరుచుకోవాలని సూచించాడు. ఢిల్లీ జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారని యువరాజ్ అభిప్రాయపడ్డాడు. కేఎల్ రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్‌తోపాటు సమీర్ రిజ్వీ, ఆశుతోష్ శర్మ వంటి ఆటగాళ్లతో బ్యాటింగ్ విభాగం బలంగా ఉందన్నాడు. అయితే జట్టు కూర్పులో సరైన నిర్ణయాలు తీసుకోవడంతోపాటు బ్యాటింగ్, ఫీల్డింగ్‌ను మెరుగుపరిచి సమతూకం సాధించాల్సి ఉందని వివరించాడు.

గంగూలీతో కలిసి పనిచేయడం ఆనందం

ఢిల్లీ క్యాపిటల్స్ కోచింగ్ బృందంలో చేరాలని గంగూలీ కోరగానే అంగీకరించినట్లు యువరాజ్ తెలిపాడు. గతంలో గంగూలీ నాయకత్వంలో ఆడిన అనుభవం తనకు ఎంతో ఉపయోగపడుతుందన్నాడు. ఆటగాళ్లను ఏకతాటిపైకి తీసుకురావడం, వారిలో నమ్మకం నింపడం గంగూలీ నుంచి నేర్చుకున్న ముఖ్యమైన పాఠాలని గుర్తుచేసుకున్నాడు. గంగూలీ అనుభవం, తన కోచింగ్ విధానాలతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను విజయాల బాట పట్టించగలమని యువీ ఆశాభావం వ్యక్తం చేశాడు.

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 252 పాయింట్లు డౌన్.. నిఫ్టీ 99 పాయింట్లు పతనం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. గత సెషన్‌లో భారీ లాభాలు నమోదు చేసిన నేపథ్యంలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడం, టోకు ధరల ద్రవ్యోల్బణం పెరగడం, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల విడుదలకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బీఎస్‌ఈ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34 శాతం) తగ్గి 72,781.89 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44 శాతం) నష్టపోయి 22,622.70 వద్ద స్థిరపడింది. దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం ఆగస్టులో 9.92 శాతంగా ఉండగా, సెప్టెంబరులో 11.39 శాతానికి పెరిగింది. ఆహారం, తయారీ ఉత్పత్తులు, ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల ఇందుకు కారణమైంది. ద్రవ్యోల్బణం పెరగడంతో వడ్డీ రేట్లపై ఒత్తిడి ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మరోవైపు బ్రెంట్ ముడిచమురు ధర 0.36 శాతం పెరిగి బ్యారెల్‌కు 106.1 డాలర్లకు చేరింది. విదేశీ సంస్థాగత మదుపరులు మంగళవారం రూ.1,305.13 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

ఐటీకి కొనుగోళ్ల మద్దతు

సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా హౌసింగ్ ఫైనాన్స్, బీమా, ఆటో, రియల్టీ షేర్లపై ఒత్తిడి కనిపించగా, ఐటీ, విద్యుత్, ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ రంగాలు లాభాల్లో ముగిశాయి. స్మాల్‌క్యాప్ సూచీ 0.72 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.14 శాతం తగ్గాయి.

Business బిజినెస్

ఐడీబీఐ వాటా విక్రయానికి కేంద్రం ఆమోదం

- ఒప్పందం పూర్తయ్యాక ప్రభుత్వంతో పాటు ఎల్ఐసీకి 34 శాతం వాటా



న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) సంయుక్తంగా కలిగి ఉన్న 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు ఫెయిర్‌ఫ్యాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించనున్నారు. కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. లావాదేవీ పూర్తయి, అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు లభించిన తర్వాత బ్యాంకు నిర్వహణ నియంత్రణ ఫెయిర్‌ఫ్యాక్స్‌కు బదిలీ కానుంది. ఐదేళ్లకు పైగా కొనసాగుతున్న ఈ విక్రయ ప్రక్రియలో తాజా నిర్ణయంతో కీలక ముందడుగు పడినట్లయింది. ఒప్పందం పూర్తయితే, ఎయిరిండియా విక్రయం తర్వాత దేశంలో జరిగిన అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణల్లో ఇది ఒకటిగా నిలవనుంది. వాటాల విక్రయం అనంతరం కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ కలిపి బ్యాంకులో 34 శాతం వాటాను కొనసాగించనున్నాయి. ఈ పునర్వ్యవస్థీకరణతో బ్యాంకింగ్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) మరిన్ని అవకాశాలు లభిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సేవలను అభివృద్ధి చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని బుధవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ లావాదేవీ పూర్తయితే భారత ఆర్థిక రంగంలో ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా నిలుస్తుందని కేంద్రం వెల్లడించింది. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం కల్పించడం, భవిష్యత్తు అవసరాలకు తగిన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడం ఈ పునర్వ్యవస్థీకరణ లక్ష్యాలని సీతారామన్ వివరించారు.

టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు

- న్యాయస్థానాలను ఆశ్రయించిన నోయల్, నెవిల్ టాటా
- తమ వాదనలు విన్న తర్వాతే ఉత్తర్వులివ్వాలని కేవియట్ పిటిషన్ల దాఖలు

ముంబై: టాటా ట్రస్ట్స్‌లో పాలనాపరమైన లోపాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా, ఆయన కుమారుడు నెవిల్ టాటా న్యాయస్థానాలను ఆశ్రయించారు. తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయకుండా చూడాలని కోరుతూ ఈ నెల 7న బాంబే హైకోర్టు, ముంబై సిటీ సివిల్ కోర్టుల్లో కేవియట్లు దాఖలు చేశారు. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్‌కు వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సంబంధిత వ్యవహారాల్లో తమ వాదనలు వినాలని కోరుతూ నోయల్, నెవిల్ టాటా గతంలో ఛారిటీ కమిషనర్ కార్యాలయంలోనూ కేవియట్లు దాఖలు చేసినట్లు సమాచారం. ఈ కేసుల్లో వేణు శ్రీనివాసన్‌తోపాటు విజయ్ సింగ్, న్యాయవాది దేరియస్ ఖంబాటా, టాటా గ్రూప్ సీనియర్ భాస్కర్ భట్‌లను సంబంధిత పక్షాలుగా పేర్కొన్నారు. మరోవైపు, టాటా సన్స్ భవిష్యత్తు, దాని స్టాక్ మార్కెట్ లిస్టింగ్ అంశాలపై టాటా ట్రస్ట్స్, కంపెనీ యాజమాన్య వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. టాటా సన్స్‌లో 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్ట్స్ లిస్టింగ్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ఎండీఆర్ ఛార్జీల నుంచి మినహాయించండి

- పెట్రోల్ బంకుల డీలర్లు
- దీపావళి తర్వాత సమ్మె హెచ్చరిక.. మార్జిన్లు పెంచాలని విజ్ఞప్తి



చండీగఢ్: డిజిటల్ చెల్లింపులపై విధించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీల నుంచి పూర్తిస్థాయి మినహాయింపు ఇవ్వాలని పెట్రోలియం డీలర్ల సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పరిమిత మార్జిన్లు, పెరుగుతున్న నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే దీపావళి తర్వాత దేశవ్యాప్త సమ్మెకు దిగే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించాయి. ఈ మేరకు రాష్ట్రీయ జన్ ఉద్యోగ్ వ్యాపార్ సంఘటన్, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్ (ఎఫ్ఏఐపీటీ), పంజాబ్, హరియాణా డీలర్ల సంఘాల ప్రతినిధులు బుధవారం వెల్లడించారు. డిజిటల్ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ ఛార్జీ విధించే ప్రతిపాదనను దీపావళి వరకు వాయిదా వేసినట్లు ఎఫ్ఏఐపీటీ ప్రతినిధి మాంటీ సెహగల్ తెలిపారు. రూ.2,000కు మించిన లావాదేవీలపై ఒక్కో చెల్లింపునకు రూ.5 స్థిర ఛార్జీ విధించే విధానం కూడా డీలర్లపై భారంగా మారుతోందన్నారు. అందువల్ల అన్ని ఎండీఆర్ ఛార్జీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

చిన్న డీలర్లకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలి

బంకుల నిర్వహణ ఖర్చులు పెరిగినా డీలర్ల మార్జిన్లు తగినంతగా పెరగలేదని సంఘాలు పేర్కొన్నాయి. 2017లో మార్జిన్లను సవరించగా, 2024 నవంబరులో స్వల్ప పెంపు మాత్రమే లభించిందని తెలిపాయి. మార్జిన్లలో 80 శాతానికి పైగా సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు, బ్యాంకు వడ్డీలు, ఇతర నిర్వహణ ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందని వివరించాయి. నెలకు 100 కిలో లీటర్లలోపు విక్రయాలు జరిపే చిన్న బంకులు మరింత ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపాయి. దేశవ్యాప్తంగా బంకుల సంఖ్య లక్ష దాటడంతో ఒక్కో బంకులో సగటు నెలవారీ విక్రయాలు 170 కిలోలీటర్ల నుంచి 130–140 కిలోలీటర్లకు పడిపోయాయని పంజాబ్ డీలర్ల సంఘం పేర్కొంది. పంజాబ్, హరియాణాల్లో పలు బంకుల విక్రయాలు 100 కిలోలీటర్లలోపే ఉన్నాయని తెలిపింది. డీలర్ల మార్జిన్లను ఇంధన విక్రయాల బిల్లు విలువలో 7 శాతానికి పెంచాలని, చిన్న డీలర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది.


అక్రమ ఇంధన రవాణాను అరికట్టాలి

చండీగఢ్ నుంచి పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతాలకు అక్రమ ట్యాంకర్ల ద్వారా ఇంధనం తరలిస్తున్నారని డీలర్ల సంఘాలు ఆరోపించాయి. చండీగఢ్‌లో వ్యాట్ రేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నాయి. ఈ పరిణామంతో సరిహద్దు ప్రాంతాల్లోని బంకుల విక్రయాలు, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం దెబ్బతింటున్నాయని తెలిపాయి. చండీగఢ్‌తో సమానంగా చమురుపై వ్యాట్ రేట్లను సవరించే అంశాన్ని పరిశీలించాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాయి.

స్టార్‌లింక్ కంటే మేమే ముందు

- భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్

న్యూఢిల్లీ: భారత శాటిలైట్ ఇంటర్నెట్ మార్కెట్‌లో వాణిజ్య సేవలు ప్రారంభించేందుకు అనుమతుల విషయంలో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ కంటే తమ సంస్థ వన్‌వెబ్ ముందుందని భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ తెలిపారు. ఐదేళ్ల క్రితమే దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఇప్పటికీ అనుమతులు రాలేదని బుధవారం బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరం–2026లో పేర్కొన్నారు. తమ ఉపగ్రహాలు ఐదేళ్లుగా భారత్‌పై పరిభ్రమిస్తున్నాయని, భూస్థాయి నెట్‌వర్క్ మూడేళ్ల క్రితమే సిద్ధమైందని వెల్లడించారు. భారత్‌లో స్టార్‌లింక్ ప్రవేశాన్ని కొన్ని శక్తిమంతమైన వ్యాపార వర్గాలు అడ్డుకుంటున్నాయని మస్క్ ఇటీవల ఆరోపించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీపై కూడా విమర్శలు చేశారు. అయితే, నియంత్రణ విధానాల్లో పక్షపాతం ఉందన్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. స్టార్‌లింక్, రిలయన్స్ జియో శాట్‌కామ్, భారతీ మద్దతున్న యూటెల్‌శాట్ వన్‌వెబ్ సంస్థలు శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు లైసెన్సులు పొందినప్పటికీ, వాణిజ్య కార్యకలాపాలకు ఇంకా స్పెక్ట్రమ్ కేటాయింపు, భద్రతా నిబంధనల అమలు వంటి ప్రక్రియలు పూర్తికావాల్సి ఉంది.



రిలయన్స్ జియో సుమారు 1,600 లో ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహాల ద్వారా దేశంలోని ఆరు లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తోంది. 52.4 కోట్ల మంది వినియోగదారులతో విస్తృత పంపిణీ వ్యవస్థ కలిగిన జియో ఈ రంగంలోకి వస్తే స్టార్‌లింక్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలను తన రిటైల్ నెట్‌వర్క్ ద్వారా అందించే అవకాశాలపై రిలయన్స్, స్పేస్‌ఎక్స్ గతంలో ఒప్పందం కూడా చేసుకున్నాయి. మరోవైపు, జియో ప్లాట్‌ఫామ్స్ ప్రతిపాదిత ఐపీఓ నేపథ్యంలో శాటిలైట్ ఇంటర్నెట్ మార్కెట్‌పై ఆసక్తి పెరుగుతోంది. ఈ రంగంలో సంస్థల పోటీకి ప్రభుత్వ అనుమతులు, స్పెక్ట్రమ్ ధరలు, భద్రతా నిబంధనలు కీలకం కానున్నాయి.



బాలీవుడ్ బాటలో కృతి శెట్టి

'ఉప్పెన' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి తొలి చిత్రంతోనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడంతో పాటు యువత హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ కృతి శెట్టి. ఆ తర్వాత వరుస అవకాశాలతో తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఆరంభంలో మంచి విజయాలు అందుకున్నప్పటికీ, ఆ తర్వాత నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలను అందుకోలేకపోయాయి. ఇటీవల విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రంలో నటించిన కృతికి నిరాశే ఎదురైంది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇదిలా ఉండగా, తాజాగా కృతి శెట్టికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఆమె త్వరలో బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ రొమాంటిక్ ప్రేమకథతో హిందీ చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘకాలం పనిచేసిన విధి ఘోద్గాంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఏవీఎస్ స్టూడియోస్ పతాకంపై అభిషేక్ ఎన్. వ్యాస్ ఈ సినిమాను నిర్మించనున్నారని, చిత్రీకరణ ఈ ఏడాదే ప్రారంభమయ్యే అవకాశముందని ప్రచారం సాగుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో కృతి శెట్టిని సరికొత్త రూపంలో చూపించేందుకు చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమా విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ ప్రచారంలో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది. మరోవైపు, తెలుగు, తమిళ చిత్రాల్లో ఆశించిన విజయాలు దక్కించుకోలేకపోయిన కృతి శెట్టికి బాలీవుడ్ అవకాశాలు కలిసివస్తాయా? అక్కడైనా విజయాన్ని అందుకుని తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టుకుంటారా? అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

20న ఆది సాయి కుమార్ మూవీ ఫస్ట్‌లుక్

యువ కథానాయకుడు ఆది సాయి కుమార్ వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు. ఇటీవల 'శంబాల' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఆయన.. ఇప్పుడు అదే విజయవంతమైన చిత్రబృందంతో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. దర్శకుడు నవరాసన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ జి. రుద్రప్ప ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. భారీ పాన్ ఇండియా స్థాయిలో పౌరాణిక, మిస్టికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతుండగా.. తాజాగా సినిమా ఫస్ట్‌లుక్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ఆది సాయి కుమార్ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అక్టోబర్ 20న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దసరా పండుగ సందర్భంగా అద్భుతమైన కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని పేర్కొంటూ సినిమాపై ఆసక్తిని పెంచారు. 'విశ్వాసమే పునాది.. రహస్యాల ఆవరణ.. ఒక దైవిక శక్తి.. అంతుచిక్కని రహస్యం.. మునుపెన్నడూ చూడని అద్భుతమైన సినిమాటిక్ అనుభవం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. వెండితెరపై కనువిందు చేసే అద్భుతమైన దృశ్యాలను వీక్షించేందుకు సిద్ధంగా ఉండాలంటూ ఆది పేర్కొన్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార దృశ్యాల్లో ఎండిపోయిన చెట్టు కింద ఉన్న పుట్టపై వివిధ దేవతలకు సంబంధించిన ఆయుధాలు కనిపిస్తున్నాయి. ఆ ఆయుధాల మధ్య త్రిశూలాన్ని చుట్టుకుంటూ పైకి వస్తున్న నాగుపాము నాలుకను బయటకు చాపి భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది. పౌరాణిక అంశాలు, మర్మమైన శక్తులు, ఉత్కంఠభరితమైన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రచార దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఫస్ట్‌లుక్ విడుదలపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. 'శంబాల' విజయానంతరం ఆది సాయి కుమార్ ఎంచుకున్న ఈ విభిన్నమైన కథ ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందోనన్న చర్చ సినీ వర్గాల్లో మొదలైంది.



నవంబర్ 19న ఈ నగరానికి ఏమైంది రిపీట్

టాలీవుడ్‌లో స్నేహానికి, యువత అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన కల్ట్ హిట్ చిత్రం 'ఈ నగరానికి ఏమైంది'కి సీక్వెల్‌గా 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోసారి తమదైన శైలిలో సందడి చేసేందుకు ఆ చిత్రంలోని స్నేహితుల బృందం సిద్ధమవుతోంది. మాస్ కా దాస్ విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో ఈసారి శ్రీనాథ్ మాగంటి స్థానంలో సుశాంత్ కనిపించనున్నారు. దర్శకుడు తరుణ్ భాస్కర్ తనదైన ఆకట్టుకునే సంభాషణలు, సహజమైన హాస్యంతో ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించారు. రూట్‌నోడ్ సినిమా పతాకంపై శృజన్ యెరబోలు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సంగీత దర్శకుడు వివేక్ సాగర్ తన బాణీలతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చిత్రీకరణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ సినిమాను నవంబర్ 19న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలో ప్రకటించింది. అయితే, సినిమా విడుదల వాయిదా పడిందంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం స్పందిస్తూ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో విశ్వక్ సేన్‌తో పాటు ఆయన స్నేహితుల బృందం భుజాలకు బ్యాగులు తగిలించుకుని, చేతిలో కెమెరాతో సరదాగా కనిపిస్తోంది. 'ఫ్లైట్ టేకాఫ్‌కు సిద్ధమైంది' అనే ఆసక్తికరమైన వ్యాఖ్యతో పోస్టర్‌ను పంచుకున్న మేకర్స్.. నవంబర్ 19న సినిమాను థియేటర్లలో ఘనంగా విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. తొలి భాగంతో యువతలో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న ఈ స్నేహితుల బృందం.. సీక్వెల్‌లో ఎలాంటి నవ్వులు పంచుతుంది? పాత జ్ఞాపకాలను తలపిస్తూ ఎలాంటి సందడి చేస్తుంది? అన్న ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది.

హారర్ కామెడీతో జై సంపత్ కొత్త ప్రయోగం

కోలీవుడ్ యువ కథానాయకుడు జై సంపత్ మరో విభిన్నమైన కథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు ప్రేమకథలు, రొమాంటిక్ చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన.. ఈసారి తన పంథాను మార్చి హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రాన్ని ఎంచుకున్నారు. త్యాగరాజ టాకీస్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి చిత్రబృందం అధికారిక ప్రకటన చేసింది. 'ప్రొడక్షన్ నం. 1' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సినిమాతో శివప్రసన్న దర్శకుడిగా చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతుండగా, ఏ.ఎం. ప్రభాకరన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇందులో జై సంపత్‌కు జోడీగా డెల్నా డేవిస్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ.. ఉత్కంఠభరితమైన కొత్త ప్రయాణం ప్రారంభమైందంటూ పేర్కొంది.



మరోవైపు సినిమా చిత్రీకరణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. తమిళనాడులోని ప్రముఖ ప్రాంతమైన తెన్‌కాశిలో చిత్రబృందం షూటింగ్‌ను ప్రారంభించింది. హాస్యంతో పాటు భయానక అనుభూతులను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందిస్తుందని మేకర్స్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే చిత్ర పరిశ్రమలో ఆసక్తి నెలకొంది. జై సంపత్ తనదైన నటనతో ఈ హారర్ కామెడీ చిత్రంలో ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తారో చూడాలి.

నితిన్ సరసన బాలీవుడ్ భామ ఆఫియా సయ్యద్

నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో యువ కథానాయకుడు నితిన్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'అలియాస్ రుక్మిణి'పై ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమాలో రుక్మిణి పాత్రలో ఎవరు నటిస్తారనే ఉత్కంఠకు తాజాగా చిత్రబృందం తెరదించింది. నితిన్‌కు జోడీగా బాలీవుడ్ ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా మేనకోడలు ఆఫియా సయ్యద్ కథానాయికగా నటించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేస్తూ.. "కృష్ణుడి ప్రాణప్రదం.. ఏమాత్రం దాపరికం లేని, నిర్భయమైన, అత్యంత ప్రత్యేకమైన వ్యక్తిత్వం.. ఆమెనే మన రుక్మిణి. రుక్మిణిగా ఆఫియా సయ్యద్‌ను పరిచయం చేసుకుందాం. 'అలియాస్ రుక్మిణి'కి ఆమెనే ప్రాణం" అంటూ చిత్రబృందం పేర్కొంది. ప్రస్తుతం ఈ గ్లింప్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆఫియా సయ్యద్ ఇప్పటికే హిందీ చిత్ర పరిశ్రమలో కథానాయికగా పరిచయమయ్యారు. మలయాళంలో ఘన విజయం సాధించిన 'ప్రేమలు' చిత్రానికి హిందీ రూపాంతరంగా వచ్చిన 'ప్రేమ్ కీతాను' సినిమాతో ఆమె వెండితెరకు పరిచయమైనట్లు సమాచారం. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఇప్పుడు 'అలియాస్ రుక్మిణి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానున్న ఆఫియా.. ఈ సినిమాతో ఎలాంటి గుర్తింపు సంపాదించుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. నితిన్ కథానాయకుడిగా, నాని నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? తెలుగు ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుంది? అన్నది తెలియాలంటే సినిమా విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

అనుపమతో నటించడానికి భయమేసింది

'నవరసరాయ' డా. నరేశ్ విజయకృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, 'రాజ్ వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్ ఉద్దమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. యారో సినిమాస్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్ 2గా ప్యాషనేట్ నిర్మాత బూసం జగన్‌మోహన్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న యువ నటుడు అఖిల్ ఉద్దమారి సినిమా విశేషాలను పంచుకున్నారు. మంచి కథలో, మంచి సినిమాలో నటుడిగా భాగం కావడమే తనకు ముఖ్యమని, పాత్ర నిడివి ఎంత అనేది తాను పట్టించుకోనని చెప్పారు. 'క్రేజీ కల్యాణం'లో తన పాత్రకు ఎంత శక్తి, నటన అవసరమో అంతా అందించానని తెలిపారు. గతంలో 'రౌడీ బాయ్స్' సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించగా, తాను చిన్న పాత్రలో కనిపించానని గుర్తుచేసుకున్నారు. ఆ సినిమా చూసినప్పుడు, తాను హీరోగా మారిన తర్వాత అనుపమతో కలిసి నటించాలని తన తల్లి కోరుకున్నారని, ఇప్పుడు ఆమె కోరిక నెరవేరడం ఆనందంగా ఉందని అఖిల్ చెప్పారు. 'క్రేజీ కల్యాణం' వంటి మంచి చిత్రంలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సినిమాలో అనుపమ పాత్రకు తాను ఏ విధంగా అండగా నిలిచానో తెరపై చూడాలని ప్రేక్షకులను కోరారు. అనుపమతో కలిసి నటించడం మొదట్లో కొంత భయంగా అనిపించినప్పటికీ, ఆమె ఇచ్చిన సహకారంతో సగం రోజులోనే సౌకర్యంగా భావించానని తెలిపారు. ప్రతి సన్నివేశం చిత్రీకరణకు ముందు తామిద్దరం పాత్రలను ఎలా పోషించాలనే విషయంపై చర్చించుకునేవారమని వివరించారు. నటీనటులుగా కాకుండా తమ పాత్రలుగానే భావించి సన్నివేశాలు చేశామని అఖిల్ వెల్లడించారు. దసరా కానుకగా విడుదల కానున్న 'క్రేజీ కల్యాణం' ప్రేక్షకులను ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.



సూపర్‌స్టార్ నిరాడంబరతకు నెల్సన్ ఫిదా

సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ చిత్రం 'జైలర్ 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్.. రజనీకాంత్ వ్యక్తిత్వం, ఆయన నిరాడంబరత గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. తాను ఇప్పటివరకు పనిచేసిన నటులందరిలో షూటింగ్‌కు అతి తక్కువ మంది సిబ్బందితో వచ్చే వ్యక్తి రజనీకాంత్ అని ఆయన తెలిపారు. సూపర్‌స్టార్ బృందంలో కేవలం ముగ్గురు మాత్రమే ఉంటారని, వారిలో రజనీకాంత్ కూడా ఒకరని సరదాగా వ్యాఖ్యానించారు. ఆయనతో పాటు పనిచేసే సిబ్బంది రోజుకు కనీసం ఐదుసార్లయినా సరదాగా ఆటపట్టిస్తుంటారని, రజనీకాంత్ కూడా వారితో ఎంతో హాయిగా గడుపుతారని నెల్సన్ పేర్కొన్నారు. సాధారణంగా ఓ స్టార్ నటుడు షూటింగ్‌కు వస్తున్నాడంటే ఆయన రాక కోసం చిత్రబృందం ఆసక్తిగా ఎదురుచూస్తుందని, హడావుడిగా, ఘనంగా ఆయన సెట్‌లోకి రావాలని అందరూ భావిస్తారని చెప్పారు. అయితే రజనీకాంత్ విషయంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంటుందని వివరించారు. ఆయన ఎప్పుడు సెట్‌కు వస్తారో కూడా ఎవరికీ తెలియదని, తాము వెనక్కి తిరిగి చూసేసరికి అప్పటికే ఆయన అక్కడికి చేరుకుని నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ కనిపించేవారని గుర్తుచేసుకున్నారు.

రజనీ సింప్లిసిటీనే ఆయన ప్రత్యేకత!

ఎంతటి స్టార్‌డమ్ ఉన్నప్పటికీ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎంతో నిరాడంబరంగా ఉంటారని బాలీవుడ్ నటి విద్యాబాలన్ అన్నారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్యుడిలా మెలగడం ఆయన ప్రత్యేకతని, అందుకే కోట్లాది మంది అభిమానులు రజనీకాంత్‌ను అంతగా ప్రేమిస్తారని పేర్కొన్నారు. రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన 'జైలర్ 2' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన విద్యాబాలన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. ఒక లెజెండ్‌తో కలిసి తెరను పంచుకునే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. రజనీకాంత్ నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని, ఆయన వ్యక్తిత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ''రజనీకాంత్ నుంచి మనం నేర్చుకోవడానికి, మన జీవితాల్లో అలవర్చుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయి. ఆయనలో ఎలాంటి ఆర్భాటం కనిపించదు. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నా చాలా సాధారణమైన వ్యక్తిలా ఉంటారు. ప్రేక్షకులు ఆయనను ఇంతగా ప్రేమించడానికి, అభిమానించడానికి ఇదే ప్రధాన కారణమని నేను భావిస్తున్నాను. అలాంటి గొప్ప నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. ఆయనతో పనిచేసినంతసేపూ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. ఒకవేళ ఏదైనా విషయంలో అందోళనగా అనిపించినా, ఆయన తన మాటలతో ఆ భయాన్ని తగ్గించేస్తారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తారు. ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ ప్రోత్సహిస్తుంటారు. ఆయన ప్రవర్తన చూస్తే ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే విషయం అర్థమవుతుంది'' అని విద్యాబాలన్ వివరించారు. అయితే 'జైలర్ 2' చిత్రీకరణ సమయంలో ఒక సన్నివేశం విషయంలో మాత్రం తాను కొంత భయాందోళనకు గురయ్యానని ఆమె వెల్లడించారు. రజనీకాంత్ ముఖంపై సిగరెట్ పొగ వదిలే సన్నివేశాన్ని చిత్రీకరించాల్సి వచ్చిందని, దానికి ముందు తనకు కొత్త డైలాగులు ఇవ్వడంతో వాటిని ఎలా చెప్పాలా అని ఆందోళన చెందినట్లు తెలిపారు. ''ఆ సన్నివేశానికి ఒక్కరోజు ముందు నాకు సుమారు ఒకటిన్నర పేజీల కొత్త డైలాగులు ఇచ్చారు. ఆ డైలాగులను చెబుతూనే సిగరెట్ కూడా కాల్చాల్సి వచ్చింది. ఒకవైపు డైలాగులు గుర్తుంచుకుని చెప్పడం, మరోవైపు సన్నివేశానికి తగ్గట్టుగా నటించడం ఎలా సాధ్యమవుతుందోనని భయపడ్డాను. ఆ సన్నివేశాన్ని సరిగ్గా చేయగలనా లేదా అనే సందేహం కలిగింది'' అని విద్యాబాలన్ పేర్కొన్నారు. షూటింగ్ సమయంలో ఆమె చేతులు వణకడాన్ని దర్శకుడు నెల్సన్ గమనించినట్లు కూడా వెల్లడైంది. సాధారణంగా కెమెరా ముందు ఎన్నో పాత్రల్లో నటించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇలాంటి ప్రత్యేకమైన సన్నివేశాలు నటీనటులకు కొత్త సవాళ్లను విసురుతాయని ఈ సందర్భంగా తెలియజేస్తోంది.



'నా వైఫ్ మిస్సింగ్' నుంచి 'అరెరే వినవా..' పాట విడుదల

వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సరికొత్త థ్రిల్లర్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. లైట్ హౌస్ సినీ మ్యూజిక్ పతాకంపై శివ కంఠంనేని నిర్మించిన ఈ సిరీస్‌కు స్వాతిప్రకాష్ ముంతిప్రగడ దర్శకత్వం వహించారు. ఆహా ఒరిజినల్‌గా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 22 నుంచి తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సిరీస్‌లోని 'అరెరే వినవా..' పాటను దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నా వైఫ్ మిస్సింగ్' అనే టైటిల్ వినగానే ఈ సిరీస్ చూడాలనే ఆసక్తి కలుగుతోందని, 'అరెరే వినవా..' పాట చాలా బాగుందని ప్రశంసించారు. సంగీత దర్శకుడు సాయి కార్తీక్ ఈ పాటను ఆకట్టుకునేలా స్వరపరిచారని పేర్కొన్నారు. ఈ సిరీస్‌తో స్వాతి దర్శకురాలిగా పరిచయం అవుతున్నారని, నిర్మాత శివ కంఠంనేని, ఆయన స్నేహితులు ఈ ప్రాజెక్ట్‌తో పెద్ద విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి మంచి కథాంశాలతో కూడిన కంటెంట్‌ను ఆహా మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. సాయి కార్తీక్ స్వరపరిచిన ఈ పాటను గాయకుడు అనురాగ్ కులకర్ణి మధురంగా ఆలపించగా, శ్రీ సాయి కిరణ్ ఆకట్టుకునే సాహిత్యాన్ని అందించారు. 'అరెరే వినవా.. కదిలే కలవా.. నా ఊహల్లోనూ, నా ఆశల్లోనూ అందంగా దాచుకుంటున్నానే..' అంటూ సాగే ఈ గీతం శ్రోతలను ఆకట్టుకునేలా ఉంది. థ్రిల్లర్ కథాంశంతో రూపొందిన 'నా వైఫ్ మిస్సింగ్' సిరీస్‌లో ఈ పాట ఎలాంటి సందర్భంలో వస్తుందో, కథలో ఎలాంటి ప్రత్యేకతలు ఉండబోతున్నాయో తెలుసుకోవాలంటే స్ట్రీమింగ్ ప్రారంభమయ్యే వరకు వేచి చూడాల్సిందే.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.